Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 13 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 6 ఫిబ్రవరి 2024 | మంగళవారం | పేజీలు : 4

## మెట్రోలో అసభ్యంగా ప్రవర్తిస్తే రూ.10 వేల ఫైన్

బెంగళూరు : మహిళా ప్రయాణికులపై లైంగిక వేధింపులను నియంత్రించేందుకు బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (బీఎంఆర్‌సీఎల్) ప్రత్యేక చర్యలకు సిద్ధమైంది. లైంగిక వేధింపులకు పాల్పడితే రూ.10 వేలు జరిమానా విధించనున్నారు. గతంలో రూ.500 ఉన్న జరిమానా మొత్తాన్ని ఏకంగా రూ.10 వేలకు పెంచారు. మెట్రోలో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న క్రమంలో మహిళా ప్రయాణికులపై వేధింపులు కూడా పెరుగుతున్నాయి. ఇటీవల ఓ మహిళ పట్ల ఓ వ్యక్తి అనుచితంగా ప్రవర్తించిన అంశం వెలుగులోకి వచ్చింది. దీంతో మెట్రో రైలు, స్టేషన్లలో అనుచితంగా ప్రవర్తించేవారికి తగిన గుణపాఠం చెప్పాలనే ఈ నిర్ణయం తీసుకున్నారు.






# ఆరు నూరైనా... మళ్ళీ వచ్చేది మేమే...!

## హ్యాట్రిక్ విజయంపై ప్రధాని ధీమా

లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి సంబంధించిన ధన్యవాద తీర్మానంపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగించారు. కాంగ్రెస్‌తో సహా ప్రతిపక్ష పార్టీలపై ప్రధాని మోడీ విరుచుకుపడ్డారు. విపక్షాల తీర్మానాన్ని నేను అభినందిస్తున్నాను అని ప్రధాని మోడీ అన్నారు. విపక్షాలు చాలాకాలం పాటు విపక్షంలోనే ఉండాలనే సంకల్పం తీసుకున్నాయని ప్రధాని ఎద్దేవా చేశారు. మరోవైపు%ౌా% ఈ రోజు దేశం ఎదుర్కొంటున్న సమస్యలకు కాంగ్రెస్సే కారణమని దుయ్యబట్టారు. వారసత్వ రాజకీయాలను ప్రోత్సహిస్తూ కేవలం ఒక్కరి కోసమే కాంగ్రెస్ పాకులాడుతోందని ఆరోపించారు. పదేళ్ల కాలంలో ప్రతిపక్ష పాత్ర పోషించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఎన్నికల తర్వాత విపక్ష నేతలు ప్రేక్షకుల సీట్లకు పరిమితమవుతారని మోడీ స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఓటమి కోసమే ప్రతి పక్షాలు తీవ్రంగా కష్టపడుతున్నాయని అన్నారు. కాంగ్రెస్ వైఖరి వల్ల దేశానికి, ప్రజాస్వామ్యానికి నష్టమని ప్రధాని తెలిపారు. ఒకే ప్రొడక్టును కాంగ్రెస్ పదే పదే రీలాంచ్ చేస్తోంది.. కాంగ్రెస్ దుకాణం ఒక్క నాయకుడి కోసమేనని విమర్శించారు. వాళ్ల దుకాణాలు త్వరలోనే మూతపడతాయని.. కాంగ్రెస్ బద్ధకాన్ని చూస్తే జాలేస్తోందని మోడీ ఆరోపించారు. కాంగ్రెస్ నత్తనడకతో ఎవరూ పోటీ పడలేరంటూ సెటైర్లు వేశారు. మరోసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పడబోతుందని ప్రధాని మోడీ తెలిపారు. ఎవ్వరేమనుకున్నా తమకు హ్యాట్రిక్ విజయం ఖాయమన్నారు. బీజేపీకి సొంతంగా 370కి పైగా సీట్లు వస్తాయన్నారు. ఎన్డీయేకు వందకు పైగా సీట్లు వస్తాయని మోడీ పేర్కొన్నారు. ఇదిలా ఉంటే.. 2014లో దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో 11వ స్థానంలో ఉంది.. ప్రస్తుతం దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో 5వ స్థానానికి చేరిందని తెలిపారు. మూడో టర్మ్ లో ప్రపంచలోనే మూడో ఆర్థిక శక్తిగా భారత్ ఎదుగబోతుందని పేర్కొన్నారు. మూడో టర్మ్ లో వెయ్యేళ్ల అభివృద్ధికి సరిపడా పునాదులు వేస్తామని.. దేశ ప్రజలు తమ పాలనను వెయ్యేళ్లు గుర్తుంచుకుంటారని ప్రధాని మోడీ తెలిపారు.

**30 ఏళ్లు అక్కర్లేదు...మూడో టర్మ్‌లో మూడో స్థానంలో భారత్ :** కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. మూడో టర్మ్‌లోనే ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అమెరికా, చైనా సరసన భారత్‌ను నిలిపే బాధ్యత తమదని హామీ ఇచ్చారు.

ప్రపంచంలో 11వ స్థానంలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థను 5వ స్థానంలోకి తమ ప్రభుత్వం తీసుకువచ్చిందని, మూడో స్థానంలోకి తీసుకువెళ్లడం తమ విజన్ అని స్పష్టం చేశారు. రాష్ట్రపతి బడ్జెట్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానానికి మోదీ సమాధానమిస్తూ, పదేళ్ల పాలనానుభవం వల్లే ఇవాల్టి పటిష్ట ఆర్థిక వ్యవస్థ, వేగవంతమైన దేశ ప్రగతి సాధ్యమైందన్నారు.

మూడో టర్మ్‌లో ప్రపంచంలోనే మూడవ ఆర్థిక శక్తిగా భారత్ ఎదుగుతుందని ధీమాగా చెప్పగలనని అన్నారు. ఇది మోదీ గ్యారెంటీ అని ఆయన అన్నారు. "2014లో ఇండియా 11వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. ఈరోజు 5వ స్థానానికి చేర్చాం. అయినప్పటికీ కాంగ్రెస్ మౌనంగానే ఉంది. వాళ్లు కనీసం కలలుగనే సామర్థ్యాన్ని కూడా కోల్పోయారు. ఈసారి నేను హామీ ఇస్తున్నాను.

దేశ ప్రజలు మరో 30 ఏళ్ల వరకూ ఆగనవసరం లేదు. మా మూడో టర్మ్‌లోనే ప్రపంచంలోని మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను తీర్చిదిద్దుతాం" అని మోదీ స్పష్టం చేశారు.

## నేడు తెలంగాణ భవన్‌కు బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 5: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రేపు (మంగళవారం) తెలంగాణ భవన్‌కు రానున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత తొలిసారిగా కేసీఆర్ తెలంగాణ భవన్‌కు వస్తున్నారు. రేపు ఉదయం 11 గంటలకు కృష్ణా పరివాహక ప్రాంతంలో ఉన్న ఉమ్మడి జిల్లాల నేతలతో బీఆర్ఎస్



అధినేత సమావేశం అవనున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, ఖమ్మం, నల్గొండ, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ముఖ్యనేతలు ఈ సమావేశానికి హాజరుకానున్నారు. కృష్ణా బేసిన్‌లో ఉన్న ఉమ్మడి ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడంపై భవిష్యత్ కార్యచరణపై చర్చించనున్నారు. అసెంబ్లీ సమావేశాలు, క్యాబినెట్‌లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై బీఆర్ఎస్ నేతలు చర్చ జరుపనున్నారు. అలాగే అసెంబ్లీ సమావేశాల తర్వాత నల్గొండ జిల్లాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభకు సంబంధించి రేపటి సమావేశంలో గులాబీ నేతలు చర్చించనున్నారు.

# ఖమ్మం ఎంపీ సీటు కోసం పోటాపోటీ

ఖమ్మం : తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ముగియడంతో పార్లమెంట్ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ దృష్టి పెట్టింది.. తెలంగాణ రాష్ట్రంలో 12 నుంచి 14 ఎంపీ సీట్లు గెలిపే లక్ష్యంగా ఆ పార్టీ నేతలు పావులు కదుపుతున్నారు.. గెలుపు అసాధ్యం అనుకున్నా నియోజకవర్గాల్లో కూడా బలమైన నేతలను రంగంలోకి దించేందుకు కాంగ్రెస్ పెద్దలు సిద్ధమవుతున్నారు.. అయితే ఖమ్మం ఎంపీ సీటు కోసం ఇద్దరు ప్రముఖులు ప్రధానంగా పోటీపడుతున్నారు.. ఒకరు కేంద్ర మాజీ మంత్రి రేణుక చౌదరి అయితే.. మరొకరు పొంగులేటి శ్రీనివాసులు రెడ్డి సోదరుడు పొంగులేటి ప్రసాద్ రెడ్డి.. వీరిద్దరూ ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు.. ఖమ్మం జిల్లాలో మొత్తం పది అసెంబ్లీ స్థానాలు ఉంటే వాటిల్లో తొమ్మిది స్థానాలను కాంగ్రెస్ పార్టీ దక్కించుకుంది.. దీంతో ఉమ్మడి ఖమ్మం నుంచి రేవంత్ క్యాబినెట్ లో ముగ్గురు ఎమ్మెల్యేలు మంత్రులుగా కొనసాగుతున్నారు.. వీరిలో భట్టి విక్రమార్క తో పాటు పొంగులేటి శ్రీనివాసులు రెడ్డి , తుమ్మల నాగేశ్వరావు ఉన్నారు.. ఖమ్మం ఎంపీ స్థానం నుంచి పోటీ చేసేందుకు తనకు అవకాశం కల్పించాలంటూ మాజీ కేంద్రమంత్రి రేణుక చౌదరి ఇప్పటికే కాంగ్రెస్ పెద్దలను కోరింది.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీకి అండగా ఉన్నానని.. తనను గుర్తించాలంటూ ఆమె సోనియా గాంధీకి రాహుల్ గాంధీకి విజ్ఞప్తి చేశారట.. మరోపక్క మంత్రి పొంగులేటి శ్రీనివాసులు రెడ్డి సోదరుడు ప్రసాద్ రెడ్డి కూడా తన ప్రయత్నాలు ముమ్మరం చేశారని ఖమ్మం జిల్లాలో టాక్ నడుస్తోంది.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తనకు తన అన్న పొంగులేటి శ్రీనివాసులు




రెడ్డికి విస్తృత పరిచయాలు ఉన్నాయని.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో తాను పర్యటించి పార్టీని మరింత బలోపేతం చేశానని కాంగ్రెస్ హాయ్ కమాండ్ కు ఇప్పటికే వేగులు ద్వారా సమాచారం ఇచ్చారట.. తనకు అవకాశం కల్పిస్తే భారీ మెజార్టీతో ఖమ్మం సీటును కైవసం చేసుకుంటానని చెబుతున్నారట. పొంగులేటి శ్రీనివాసులు రెడ్డి సైతం తన తమ్ముడికి టికెట్ ఇప్పించేందుకు పార్టీలో ఉన్న పెద్దలందరితో టచ్ లోకి వెళ్లారట.. తన తమ్ముడు టికెట్ ఇచ్చేందుకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారట.. మొత్తంగా ఖమ్మం ఎంపీ స్థానం కోసం ఇద్దరు ప్రముఖులు పోటాపోటీగా బరిలో ఉండడంతో టికెట్ ఎవరికి వరిస్తుందోనని పార్టీలో చర్చ మొదలైంది



# 'పార్లమెంటు కోసం'

## వీల్ చైర్లో కేసీఆర్ ప్రచారం...

## వర్కవుట్ అవుతుందా?

హైదరాబాద్ : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ తెలంగాణలో ప్రధాన పార్టీలన్నీ కసరత్తులు షురూ చేస్తున్నాయి. ఈ సమయంలో అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన దానికి మించి విజయం సాధించాలని అధికార కాంగ్రెస్ పార్టీ భావిస్తున్న వేళ... అసెంబ్లీ ఎన్నికల్లో తగిలిన దెబ్బను మరిచిపోవాలంటే, మనుగడకు ఇబ్బంది కలగకూడదంటే... లోక్ సభ ఎన్నికీల్లో సత్తా చాటాలని బీఆరెస్స్ భావిస్తుంది. ఈ సమయంలో... కేసీఆర్ సరికొత్తగా ఎన్నికల ప్రచారం చేయబోతున్నారని తెలుస్తుంది. అయితే... ఇది వర్కవుట్ అవుతుందా లేదా అనేది ఇప్పుడు ఆసక్తికర అంశం! బీఆరెస్స్ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్.. తనకు తగిలిన దెబ్బల నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న సంగతి తెలిసిందే! ఈ సమయంలో... పార్లమెంటు ఎన్నికలలో అత్యధిక సీట్లను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు నాయకులకు, కార్యకర్తలకు కేటీఆర్, హరీష్ లతో దిశానిర్దేశం చేయిస్తున్నారు. ఈ లోక్ సభ ఎన్నికల్లో సత్తా చాటకపోతే మనుగడ ప్రమాదంలో పడే సూచనలు ఉన్నాయని మరోవైపు ఆందోళన నెలకొందని అంటున్నారు. ఈ సమయంలో వీల్ చైర్ లోనే ప్రచారం చేయాలని కేసీఆర్ భావించారని తెలుస్తుంది. అవును... తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో తగిలిన గాయం నుంచి కోలుకోకముందే... కేసీఆర్ బాత్రూంలో జారి పడటంతో ఆయన తుంటి ఎముక విరగడం.. దీంతో, డాక్టర్లు శస్త్ర చికిత్స చేసిన సెట్ చేయడం తెలిసిందే! అయితే ఆపరేషన్ తర్వాత కేసీఆర్ కు కొన్ని వారాలు విశ్రాంతి అవసరమని వైద్యులు డాక్టర్లు చెప్పారు. ఈ సమయంలో కేసీఆర్ కొద్దికొద్దిగా నడుస్తూ.. వీలైనప్పుడు కూర్చుంటూ.. ఎక్కువ సమయం బెడ్ పైనే ఉంటున్నారని అంటున్నారు. అంటే... కేసీఆర్ ఇంకా పూర్తిస్థాయిలో కోలుకోలేదు!! అయితే కేసీఆర్ పూర్తిగా కోలుకుని ప్రజాక్షేత్రంలోకి రావాలంటే మరింత సమయం పట్టవచ్చని తెలుస్తుంది. దీంతో... ఈలోపు లోక్ సభ ఎన్నికలు పూర్తయినా ఆశ్చర్యం లేదని అంటున్నారంట.

దీంతో... శరీరానికి తగిలిన గాయం పెద్ద లెక్క కాదని భావిస్తున్నారో ఏమో కానీ... ప్రచారానికి సిద్ధమైపోతున్నారంట కేసీఆర్. ఈ క్రమంలో ఫిబ్రవరి ఒకటవ తేదీన ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేయడం దగ్గరనుంచి.. ఎన్నికల ప్రచారం వరకూ వీల్ చైర్ లోనే అని అంటున్నారు! ఇందులో భాగంగా... ఆరోగ్యం పూర్తిగా కుదిటిపడేవారకూ ఆగడం కుదరదని భావించిన కేసీఆర్... లోక్ సభ ఎన్నికల ప్రచారానికి వీల్ చైర్ లోనే వెళ్లాలని డిసైడ్ అయ్యారని తెలుస్తోంది. గతంలోలాగే సుడిగాలి పర్యటనలు చేయాలని.. వీల్ చైర్ లోనే లోక్ సభ ఎన్నికల సమర శంఖారావాన్ని పూరించాలని భావిస్తున్నారని అంటున్నారు. ఒక్కో పార్లమెంట్ స్థానానికీ ఒక్కో మీటింగ్ మాత్రమే పెట్టి.. వీలైనంత త్వరగా సభలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారని తెలుస్తుంది.

కాగా... గతంలో పశ్చిమ బెంగాల్ ఎన్నికలలో మమతా బెనర్జీ కూడా వీల్ చైర్ లోనే ప్రచారం చేసిన సంగతి తెలిసిందే. ఆ ఎన్నికల్లో సానుభూతి ఆమెకు బాగానే వర్కౌట్ అయింది. ఈసారి తెలంగాణలో బీఆరెస్స్ అధినేత కేసీఆర్ కూడా వీల్ చైర్ లోనే ఎన్నికల ప్రచారాన్ని చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తున్న నేపథ్యంలో... కేసీఆర్ కి ఏమేరకు వర్కవుట్ అవుతుందనేది చూడాలని అంటున్నారు పరిశీలకులు.

# సంపాదకీయం

## పాక్‌లో ఎందుకిలా జరుగుతోంది

## ఇమ్రాన్ ఖాన్ 14, 10, 7 ఏళ్ల శిక్ష

పాకిస్తాన్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ చుట్టూ వివాదాలు ముసురుకుంటున్నాయి. వారం రోజుల వ్యవధిలోనే ఇమ్రాన్ ఖాన్ కు వేర్వేరు కేసుల్లో 14 ఏళ్ళు, 10 ఏళ్ళు శిక్ష పడడం సంచలనం రేపుతోంది. ఆ షాక్ నుంచి తేరుకోక ముందే ఇమ్రాన్ ఖాన్ కు పాక్ లోకి కోర్టు మరో షాకిచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా వివాహం చేసుకున్నారన్న ఆరోపణలతో ఇమ్రాన్ ఖాన్ తో పాటు ఆయన భార్య బుష్రా బీబీకి పాక్ కోర్టు తాజాగా ఏడేళ్ల జైలు శిక్ష విధించడం సంచలనం రేపుతోంది. బుష్రా బీబీ మొదటి భర్త ఫరీద్ పెట్టిన కేసుపై పాకిస్థాన్ లోని కోర్టు విచారణ జరిపి ఈ తీర్పు వెలువరించింది. ఇస్లాం షరియత్ నిబంధనల ప్రకారం భర్త చనిపోయిన లేదా విడాకులు తీసుకున్న తర్వాత మాత్రమే మరో పెళ్లి చేసుకోవాల్సి ఉంటుంది. అయితే అలా పెళ్లి చేసుకునేం దుకు ఇస్లాం షరియత్ ప్రకారం కొద్ది రోజులపాటు గ్యాప్ తీసుకోవాల్సి ఉంటుంది. కానీ, ఆ నిబంధనలను తన మాజీ భార్య బుష్రా బీబీ ఉల్లంఘించిందని ఆమె మొదటి భర్త ఫరీద్ ...ఆమెపై కేసు పెట్టారు. అంతేకాకుండా, పెళ్ళికి ముందే ఇమ్రాన్ ఖాన్ తో తన భార్య బుష్రా బీబీకి వివాహేతర సంబంధం ఉందని కూడా ఆయన సంచలన ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన న్యాయస్థానం ఇమ్రాన్ ఖాన్, బుష్రా బీబీ దంపతులకు ఏడేళ్ల శిక్ష విధిస్తూ సంచలన తీర్పు వెలువరించింది. 2017 నవంబర్ లో ఫరీద్ నుంచి బుష్రా బీబీ విడాకులు తీసుకొని ఆ తర్వాత 2018 జనవరిలో ఇమ్రాన్ ఖాన్ ను పెళ్లి చేసుకున్నారు. అంతకుముందు దోషా ఖానా కేసులో ఇమ్రాన్ ఖాన్, బుష్రా బీబీలకు 14 ఏళ్ల జైలు శిక్ష పడిన సంగతి తెలిసిందే. ఇక, అధికారిక రహస్య పత్రాల దుర్వినియోగం కేసులో ఇమ్రాన్ ఖాన్ కు పాకిస్తాన్ లోని కోర్టు 10 ఏళ్ల శిక్ష విధించింది. వారం రోజుల వ్యవధిలోనే ఇమ్రాన్ ఖాన్ కు 3 కేసులలో అన్నేసి ఏళ్లు శిక్ష పడడం సంచలనం రేపుతోంది. ఫిబ్రవరి 8వ తేదీన పాకిస్థాన్ లో ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో ఇమ్రాన్ ఖాన్ కు వరుస శిక్షలు పడటం విశేషం.

# పారదర్శకంగా ఈ.వి.ఎం. యంత్రాల ఎఫ్.ఎల్.సి నిర్వహణ...

### మొదటి స్థాయి పరిశీలనలో జాగ్రత్తగా ఉండాలి...

### ఈవీఎమ్మును పరిశీలించిన జిల్లా కలెక్టర్ గౌతమ్.



జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) :పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వీవీ ప్యాట్లకు సంబంధించి మొదటి స్థాయి పరిశీలన (ఫస్ట్ లెవల్ చెకప్%--% ఎఫ్ఎల్సీ) క్షుణ్ణంగా చేయాలని మేడ్చల్ %--% మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఫస్ట్ లెవల్ చెకప్ (ఎఫ్ఎల్సీ)ని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియతో కలిసి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎమ్), వీవీ ప్యాట్లకు మొదటి విడత తనిఖీని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మొదటి విడత తనిఖీలో ఈవీఎమ్ము పరిశీలించినట్లు పేర్కొన్నారు. ఫస్ట్ లెవల్ చెకప్ కార్యక్రమాన్ని సోమవారం (నేటి) నుంచి ఈనెల 14వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. జిల్లాలో సోమవారం నుంచి మొదలుకొని ఈనెల 14వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా ఈవీఎమ్ యంత్రాల ఫస్ట్ లెవెల్ చెకింగ్ (ఎఫ్ఎల్సీ) నిర్వహించడం జరుగుతుందని ఈ విషయంలో ఈవీఎమ్లపై ఎలాంటి అనుమానాలకు చోటు లేకుండా ప్రక్రియ జరుగుగుతుందని కలెక్టర్ గౌతమ్ వివరించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరును ప్రాథమికంగా పరిశీలన (ఎఫ్ఎఎల్సీ) జరిపేందుకు ఈసీఐఎల్కు చెందిన 26 మంది సాంకేతిక నిపుణుల బృందం జిల్లాకు చేరుకుందని ఈవీఎంల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు (ఈవీఎమ్)లకు సంబంధించి పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తూ, నిబంధనలు తు.చ. తప్పకుండా ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అంతకు ముందు. జిల్లాలోని ఉప్పల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్ శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల గోడౌన్లను కలెక్టర్ గౌతమ్, ఆయా రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో అందులోని ఈవీఎమ్ము, యంత్రాలను పరిశీలించారు. జిల్లాలోని కూకట్పల్లి, మేడ్చల్ శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించిన ఎలక్షన్ పిటిషన్ ఉండటం వల్ల గోడౌన్లను తెరవలేదని కలెక్టర్ గౌతమ్ స్పష్టం చేశారు.

# జిల్లా వ్యాప్తంగా ఇంటెన్సివ్ పోలియో ఇమ్యునైజేషన్ క్యాంప్ నిర్వహించాలి...

### ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేసేలా చర్యలు చేపట్టాలి...

### మేడ్చల్ మల్కాజిగిరిజిల్లా వైద్యాధికారి రఘునాథ స్వామి







జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలోని ప్రతి చిన్నారికి పల్స్ పోలియో చుక్కలు అందేలా జిల్లా వైద్య యంత్రాంగం కృషి చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్యాధికారి డాక్టర్ రఘునాథ స్వామి సూచించారు. వచ్చే నెల మూడవ తేదీన నిర్వహించబోయే పల్స్ పోలియో క్యాంప్ కొరకు సన్నాహక పల్స్ పోలియో సదస్సును మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సమీకృత కలెక్టరేట్ భవనంలోని డిఎంహెచ్వో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎన్ఓ ద్వారా జిల్లాలోని వైద్య అధికారులతో పాటుగా సంబంధిత సూపర్వైజర్ లందరికీ ఇంటెన్స్ పోలియో ఇమ్యునైజేషన్ పిల్లలకు ఏ విధంగా ఇవ్వాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి తదితర విషయాలను క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ రఘునాథ స్వామి మాట్లాడుతూ... ఐదేళ్లలోపు పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు తప్పక అందేలా ప్రతి ఒక్క వైద్య సిబ్బంది కృషి చేయాలని సూచించారు. పట్టణ పల్లె టూరు అన్న భేదం లేకుండా ప్రతి చోట ప్రతి ఒక్క చిన్నారికి పల్స్ పోలియో చుక్కలు వేసేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి రఘునాథ స్వామి ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రి, ఏరియా ఆసుపత్రులు ఇలా వైద్య శాఖలోని ప్రతి ఒక్కరు సమన్వయంతో కలిసికట్టుగా ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగి ప్రతి ఒక్క చిన్నారికి పల్స్ పోలియో చుక్కలు వేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యాశాఖ, సమగ్ర శిశు ఆరోగ్య శాఖ, గ్రామీణాభివృద్ధి సంస్థ, మహిళా స్వయం సహాయక బృందాలు తోపాటుగా నర్సింగ్ కళాశాలల వాలంటరీలు పోలియో టీకల కార్యక్రమంలో నిమగ్నం అవ్వాలని సూచించారు.

దాంతో పాటుగా వలస జనాభా, సంచార సంఘాలు, నిరాశ్రయులు ఇలా ప్రతి ఒక్క చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



# ప్రజావాణిలా 150 ఆర్జీలు...

**జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) :మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లా ఆఫీసర్ చంద్రావతి, సోమవారం కలెక్టరేట్ కార్యాలయము లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 150 అర్జీలను స్వీకరించడం జరిగిందని లా ఆఫీసర్ చంద్రావతి తెలిపారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని లా ఆఫీసర్ చంద్రావతి, అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.**

# జిల్లా నెహ్రూ యువక కేంద్ర అడ్వైజరీ సభ్యునిగా నరేష్ యాదవ్ నియామకం...



శామీర్ పేట, ( గరుడ వార్త) : జిల్లా నెహ్రూ యువక కేంద్ర అడ్వైజరీ బోర్డు నూతన సభ్యునిగా తోకల నరేష్ యాదవ్ నియమితులయ్యారు. మేడ్చల్ జిల్లా నెహ్రూ యువక కేంద్ర అడ్వైజరీ బోర్డు నూతన సభ్యునిగా శామీర్ పేట మండలం తూముకుంట మున్సిపాలిటీకి చెందిన తోకల నరేష్ యాదవ్ ను నియమిస్తూ నెహ్రూ యువక కేంద్ర డైరెక్టర్ జనరల్ నితీష్ కుమార్ మిశ్రా ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ ఉత్తర్వుల కాపీని సోమవారం బిజెపి జిల్లా అధ్యక్షుడు విక్రం రెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుమలరెడ్డి, కార్యదర్శి అమర మోహన్ రెడ్డి లు నరేష్ యాదవ్ కు అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన నరేష్ యాదవ్ మాట్లాడుతూ తనను నెహ్రూ యువక కేంద్ర అడ్వైజరీ బోర్డు జిల్లా సభ్యునిగా నియమించినందుకు గాను బిజెపి రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఎంతో నమ్మకం, విశ్వాసంతో తనను ఆ పదవిలో నియమించినందుకు బాధ్యతగా విధులను నిర్వర్తిస్తానని, అడ్వైజరీ బోర్డు నియమ నిబంధనల మేరకు నడుచుకుంటానని నరేష్ యాదవ్ చెప్పారు.

# ప్రజావాణికి 97 ఫిర్యాదులు

నిజామాబాద్ ,ఫిబ్రవరి 05 : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిం చాలని అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 97ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ



సమస్యలను అదనపు కలెక్టర్ తో పాటు, నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.మకరందు, డీపీఓ జయసుధలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


# లంచం తీసుకుంటు ఏసీబీ కి చిక్కిన తోర్లికోండ గ్రామ పంచాయతీ కార్యదర్శి

నిజామాబాద్, ఫిబ్రవరి 05 : నాలుగు వేలు లంచం తీసుకుంటూ పంచాయతీ కార్యధర్శి ఎసిబి అధికారులకు రెడ్ హ్యాండేడ్ గా చిక్కారు. ఈ వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం నిజామాబాద్ జిల్లా జక్రాన్ పల్లి మండలం తోర్లి కోండ గ్రామంలో ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామానికి చెందిన నిఖిల్ అనే యువకు డు ఇటీవల తోర్లికోండలో ఒక ఇంటిని కోనుగోలు చేశాడు దానిని రిజిస్ట్రేషన్, ఎన్ఓసి కోసం గ్రామ పంచాయతి కార్యదర్శి తోపారం మనోహర్ ను సంప్రదించగా, రూ.15 వేలు లంచం ఇస్తేనే ధ్రువీకరణ పత్రం ఇస్తానని చెప్పడంతో బాధితుడు ఏసీబీ అధికారులకు పిర్యాదు చేశాడు.ఏసీబీ అధికారుల సూచనల మేరకు సోమవారం గ్రామ పంచాయతి కార్యలయంలో మనోహర్ రూ.4 వేల లంచం తీసుకుంటుండగా నిజామాబాద్ ఏసీబీ డిఎస్పీ, ఇన్స్ పెక్టర్ లు దాడి చేసి రెడ్ హ్యాండేడ్‌గా పట్టుకున్నారు. గ్రామ పంచాయతీ లో రికార్డులను పరిశీలించారు. మనోహర్ ను అరెస్టు చేసి కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు.

# సరిహద్దుల్లో ఉన్న వాగు సమస్యను పరిష్కరించి గ్రామంలో శాంతి నెలకొల్పాలి

### - సమస్య పరిష్కరించాలని ప్రజావాణిలో బైటయించిన జానకంపేట గ్రామస్తులు.

నిజామాబాద్, ,ఫిబ్రవరి 05 : నిజామాబాద్ జిల్లాలోని బాల్కొండ నియోజకవర్గం వేల్పూరు మండలంలోని జాన్కంపేట్-పచ్చల నడ్కుడ గ్రామాల మధ్య నెలకొన్న సరిహద్దు వాగు సమస్యను పరిష్కరించి రెండు గ్రామాల్లో శాంతి నెలకోలపాలని జాన్కంపేట గ్రామస్తులు కోరారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయానికి జాన్కంపేట్ గ్రామస్తులు సరిహద్దు వాగు సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రజావాణిలో తమ సమస్య పరిష్కరించేంత వరకు



ఇక్కడి నుంచి వెళ్లేది లేదంటూ బైఠాయించారు. అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) చిత్ర మిశ్రా సమస్య పరిష్కరిస్తామని సముదాయించడంతో జానకంపేట్ గ్రామస్తులు ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా జానకంపేట గ్రామస్తులు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుంచి ఇరు గ్రామాల మధ్య పెండింగ్లో ఉన్న సరిహద్దు వాగు సమస్యపై జిల్లా కలెక్టర్ ప్రభుత్వం దృష్టిసారించి ప్రత్యేక చర్యలు తీసుకొని సరిహద్దు వాగు సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రమేష్,జానకంపేట గ్రామస్తులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అమెరికాలో 'కాండిడా ఆరిస్' కలకలం

వాషింగ్టన్ : అగ్రరాజ్యం అమెరికాను 'కాండిడా ఆరిస్' అనే ప్రాణాంతక ఫంగల్ ఇన్ఫెక్షన్ కలవరపెడుతోంది. వాషింగ్టన్‌లో నెల రోజు ల వ్యవధిలోనే నలుగురు వ్యక్తులకు ఈ ఇన్ఫెక్షన్ సోకింది. ఈ అరుదైన ఫంగస్ అత్యంత హానికరమని, దీని బారినపడిన వారిలో మరణాల రేటు అధికంగా ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

రోగ నిరోధక శక్తి తక్కువున్నవారికి ఇది తొందరగా సోకుతుందని, పలు ప్రభావవంతమైన యాంటీ ఫంగల్ ఔషధాలు సైతం దీని చికిత్సలో ప్రభావం చూపలేకపోతున్నాయని చెబుతున్నారు. దీనికి సులభంగా వ్యాప్తిచెందే లక్షణాలు ఉండడంతో.. చాలా జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

# ఆర్టీసీకి సవాల్‌గా జాతర సన్నద్ధత?

కొత్తగూడెం : మేడారం జాతర ఏర్పాట్ల వ్యవహారం కొత్తగూడెం ఆర్టీసీ డిపో అధికారులకు సవాలుగా మారుతోంది. సర్వీసుల పెంపు, రద్దీకి అనుగుణంగా సేవలు అందించేందుకు సిబ్బంది లేకపోవడం సమస్యాత్మకంగా మారింది. ఇల్లెందు మినీ డిపో ఏర్పాటు తర్వాత సగానికి సగం మంది కార్మికోద్యోగులను అక్కడికి పంపడంతో ప్రస్తుతం కొరత ఎదురైంది. కీలకమైన విభాగాల్లో పనిచేయాల్సిన అధికారులూ అందుబాటులో లేరు. ప్రస్తుతం 'గూడెం' డిపోలో అన్ని విభాగాల్లో కలిపి 240 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో 70 మంది డ్రైవర్లు, 100 మంది కండక్టర్లు, 20 మంది మెకానిక్, మిగిలిన వారు ఇతర ఉద్యోగులు పనిచేస్తున్నారు. అవసరాలకు తగినన్ని సీఐ, ఎస్‌టీఐ, ఐటీ-2, స్టేషన్ మేనేజర్ (ఎస్.ఎం.), ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ల పోస్టులు లేవు. పండగలు, జాతర్ల సమయంలో ఇతర డిపోల నుంచి సర్వీసులు తెప్పించినా సిబ్బంది కొరతతో పర్యవేక్షణ కష్టతరమవుతోంది. వాలంటీర్లు సైతం అధిక సంఖ్యలో అవసరమయ్యే పరిస్థితులున్నాయి. గతంలో 500 మందికి పైగా సిబ్బంది ఇక్కడ పనిచేసేవారు.

'ఓటీ'లపై అసంతృప్తి

డిపో పరిధిలో మేడారం జాతర విధులు నిర్వర్తించే ఉద్యోగులపై పనిభారం తప్పడం లేదు. కనీసం రెండు నుంచి నాలుగు ట్రిప్పులు వేయాల్సి వస్తోంది. 8 గంటల పనివేళలు దాటి పనిచేసే డ్రైవర్లు,




కండక్టర్లకు నాలుగు, మెకానిక్‌లకు ఏడు గంటల పాటు ఓటీ చెల్లించాలి. ఓటీలు ఎంత వరకు చెల్లిస్తారనే విషయంపై ఇంకా ఉద్యోగులకు స్పష్టత ఇవ్వలేదు. గతంలో జాతర విధులు నిర్వర్తించిన వారికి ఓటీలు చెల్లించలేదు. అడ్వాన్స్ కింద ఒక్కో ఉద్యోగికి రూ.5 వేలు చెల్లించి, ఆ తర్వాత వేతనాల్లోంచి కోత విధించడంపైనా అసంతృప్తి వ్యక్తమవుతోంది. జాతర విధులు నిర్వర్తించిన సుమారు 150 మంది ఉద్యోగుల అలవెన్సులూ చెల్లించలేదు.

'ఉద్యోగులకు ఓటీలపై అధికారులు స్పష్టత ఇవ్వాలి. అంతర్గత సమస్యలపై రీజనల్ మేనేజర్ దృష్టిసారించాలి. సిబ్బంది కొరతను తీర్చడంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి'.

కె.భాస్కర్‌రావు, ఆర్టీసీ ఈయూ రీజియన్ గౌరవాధ్యక్షుడు

'జాతర విధులకు వెళ్లే ఉద్యోగులకు చెల్లించే ఓటీల విషయమై ఉన్నతాధికారులతో చర్చించి వెంటనే నిర్ణయం తీసుకుంటాం. ఇబ్బందులు లేకుండా చూస్తాం. భక్తులకు కావాల్సిన మేర ప్రత్యేక బస్సులు అందుబాటులోకి తెస్తున్నాం.'సీహెచ్.వెంకన్న, రీజినల్ మేనేజర్

# చైతన్య స్ఫూర్తి.. లాభాల దివిటీ

మణుగూరు : పరిశ్రమల్లో సింగరేణి సంస్థ అగ్రభాగాన కొనసాగుతోంది. విద్యుదుత్పత్తి అవసరాలు తీర్చేందుకు, రాష్ట్రం ఆర్థికంగా బలపడేందుకు సింగరేణి వెన్నుదన్నుగా నిలుస్తోంది. అటువంటి సంస్థ ఎదుర్కొంటున్న ఒడిదొడుకులను, కంపెనీ ఆర్థిక పరిస్థితిని ఉద్యోగులకు వివరించాలని సింగరేణి నిర్ణయించింది. అందుకోసం మల్టీ డిపార్ట్‌మెంటల్ టీమ్స్ ఏర్పాటు చేసింది. ఈ బృందం సమావేశాలు ఈనెల 5 నుంచి 11 వరకు ప్రతి గనిలో మొదటి, రెండో షిఫ్ట్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియచేయనున్నారు. సింగరేణి లాభాల్లో లేకపోవటంతో, కార్మికుల్లో చైతన్యం తీసుకొచ్చి ఎక్కువ పని గంటలు పనిచేసి సంస్థను లాభాల్లోకి తీసుకొచ్చేందుకు మల్టీ డిపార్ట్‌మెంటల్ టీమ్స్‌ని 1998లో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి 2015 వరకు నిర్విరామంగా జరిగాయి. 2018 తరువాత మళ్లీ ఈ సంవత్సరంలో సమావేశాలు జరగనున్నాయి.

కార్మికులకు అవగాహన కోసం

సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి చేసే క్రమంలో యంత్రాల వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఒక్కో యంత్రం, డంపర్ల వినియోగం కనీసం అరగంట పెరిగినా సంస్థకు కోట్లలో లాభం పెరగనుంది. ఈక్రమంలో కార్మికులను చైతన్యవంతులను చేయనున్నారు. సింగరేణిలో 855 యంత్రాలు, వాహనాలు ఉన్నాయి. కానీ వాటి రోజువారి సరాసరి వినియోగం కేవలం ఏడు గంటలు మాత్రమే. ప్రస్తుత పరిస్థితిలో సింగరేణి సంస్థకు భూగర్భ గనులు గుదిబండగా మారాయి. భూగర్భ గనులతో సంభవించే నష్టాన్ని ఉపరితల గనులు, డిపాజిట్లపై వడ్డీ, విద్యుదుత్పత్తి ప్లాంట్లతో పూడ్చిలాభాలు సాధిస్తుంది. ఈ క్రమంలో ఉద్యోగులు పని గంటలను ఏవిధంగా పెంచుకోవాలనే అంశంపై



అవగాహన కల్పించనున్నారు.

చర్చించే అంశాలు 2023-24లో కంపెనీ ఉత్పత్తి, ఉత్పాదకత, బొగ్గు రవాణా, 2024-25లో కంపెనీ లక్ష్యాలు

భూగర్భ గనుల యంత్రాల వినియోగం నీ ఉపరితల గనుల భారీ యంత్రాల వినియోగం

సంస్థ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు

కంపెనీ భవిష్యత్తు, ప్రణాళికలు, ముందున్న సవాళ్లు

కంపెనీ లక్ష్యాలను సాధించడానికి ఏం చేయాలి.

టీమ్స్‌లోని అధికారుల బృందం

ఏరియా జీఎం నీ ఏరియా ఎస్‌ఓటు జీఎం

ఐఈడీ(డీజీఎం) నీ పర్సనల్ మేనేజర్

ఏరియా ఇంజనీర్

ఏరియా ఫైనాన్స్(డీజీఎం)

మల్టీ డిపార్ట్‌మెంటల్ టీమ్స్ సమావేశాల ద్వారా ఏరియా పరిస్థితిని ఉద్యోగులకు వివరిస్తాం. ఉద్యోగులు ఇచ్చే సలహాలు తీసుకొంటాం. ఉత్పత్తి లక్ష్యం, ధర, బొగ్గు నాణ్యత, వంటి అంశాలను కార్మికులకు వివరిస్తాం.దుర్గం రామచందర్, జీఎం, మణుగూరు

# ప్రత్యేకాధికారులతో పల్లె పాలన



సిరిసిల్ల : గ్రామ పంచాయతీల పాలనలో సర్పంచులదే ప్రధాన భూమిక. పాలక వర్గాల పదవీకాలం ఫిబ్రవరి 1తో ముగిసింది. జనవరిలో ఎన్నిక నిర్వహించాల్సి ఉండగా, కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేయలేదు. దీంతో పంచాయతీలకు ప్రత్యేకాధికారులను జిల్లా యంత్రాంగం నియమించింది. నేడు వారు పల్లెల్లో పరిపాలనా బాధ్యతలు చేపట్టనున్నారు.

జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పల్లెల పరిధిలో సుమారు 5 లక్షలకు పైగా జనాభా నివసిస్తున్నారు. 2019 జనవరిలో జిల్లాలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించగా, గెలుపొందిన వారు ఫిబ్రవరి 1న పదవీ బాధ్యతలు చేపట్టారు. వారి పదవీకాలం గురువారంతో ముగిసింది. ఇప్పటికే చాలా గ్రామాల్లో సర్పంచుల నుంచి రికార్డులు, దస్త్రాలు, చెక్‌బుక్, డిజిటల్ కీలను పంచాయతీ కార్యదర్శులు స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో నేటి నుంచి పంచాయతీల నిర్వహణను ప్రత్యేక అధికారులు చేపట్టనున్నారు.

139 మంది నియామకం

జిల్లాలో 255 గ్రామాలు ఉండగా జనాభా ప్రాతిపదికన 139 మంది ప్రత్యేకాధికారులను నియమించారు. జనాభా తక్కువ ఉన్న రెండు గ్రామాలకు ఒకే అధికారి బాధ్యత వహించనున్నారు. పల్లెల్లో మురుగు కాలువలు, కంపోస్టు షెడ్లు, వీధి దీపాలు, పారిశుద్ధ్య కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలును పర్యవేక్షించనున్నారు. ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులకు జాయింట్ చెక్‌పవర్ ఇవ్వనున్నారు. దీనికి సంబంధించి ఆధార్, పాన్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను సేకరిస్తున్నారు.

గతం కంటే మెరుగ్గా...

పల్లెల్లో పారిశుద్ధ్య పనులు, వీధి దీపాలు తాగు నీటి సరఫరా వంటి వాటిని నిత్యం ప్రజలు  ఎదుర్కొంటారు. వీటి పరిష్కారానికి సర్పంచులను ఆశ్రయించేవారు. స్థానికంగా ఉండే సర్పంచులకు ఒకటి రెండు సార్లు గుర్తు చేస్తేనే పరిష్కారం అయ్యేవి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు ఆలస్యమైనా జేబు నుంచి ఖర్చు చేసేవారు. చిన్న చిన్న పంచాయతీల్లో నిధులు సరిపోనప్పటికీ అష్టకష్టాల మధ్య నిర్వహణ చేసేవాళ్లు. ఇలాంటి పంచాయతీల నిర్వహణ అధికారులకు కత్తి మీద సామే. ఒక్కో అధికారికి రెండు గ్రామాల చొప్పున బాధ్యతలు అప్పగించడంతో కొంత పని ఒత్తిడి కలిగే అవకాశం ఉంది. అలాగే ఆయా గ్రామాల బాధ్యులు, పంచాయతీ కార్యదర్శులు కార్యాలయం వేళల్లో తప్పా మిగతా సమయాల్లో స్థానికంగా ఉండరు. అత్యవసర పరిస్థితులు ఉంటే ఎవరిని సంప్రదించాలన్న ప్రశ్నను ప్రజలు లేవనెత్తుతున్నారు. అలాగే అధికారులు, పంచాయతీ కార్యదర్శులు నిబద్ధతతో పని చేస్తేనే జనాలకు మెరుగైన సేవలు అందుతాయి.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా...- రవీందర్, జిల్లా పంచాయతీ అధికారి

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాలకు 139 మంది ప్రత్యేకాధికారులను నియమించాం. నేడు మండల కేంద్రాల్లో, 3న పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క దృశ్యమాధ్యమ సమీక్ష ద్వారా శిక్షణ ఇవ్వనున్నారు. జనాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మెరుగైన పాలన అందించేందుకు కృషి చేస్తాం.

# గ్రానైట్ క్వారీలపై కొరడా



కరీంనగర్: గ్రానైట్ క్వారీల్లో అక్రమాలపై మైనింగ్ శాఖ అధికారులు దృష్టి పెట్టారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు క్వారీల వద్ద రెండు, మూడు రోజులుగా తనిఖీలు చేపట్టారు. నిబంధనలను అతిక్రమిస్తూ అనుమతికి మించి తవ్వకాలు చేపట్టిన వాటితోపాటు పరిమితిని మించి వాహనాల్లో ఖనిజాన్ని తరలిస్తున్న వాటిపై చర్యలు తీసుకున్నారు. గడిచిన రెండు, మూడు రోజులుగా రహస్యంగా ఈ ప్రక్రియను కొనసాగించారు. కరీంనగర్ జిల్లాతోపాటు ఇతర జిల్లాల్లోనూ ఈ తరహా తనిఖీలు జరిగినట్లు తెలుస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చేపట్టిన తనిఖీల్లో విస్తుపోయే విధంగా అక్రమాలు చోటు చేసుకుంటున్నట్లు అధికారులు గుర్తించారు. లీజు నిబంధనలు చాలాచోట్ల పాటించడం లేదనేది తెలిసింది. మొత్తంగా 10 క్వారీలపై కేసులు నమోదు చేసి రూ.6,16,96,528 జరిమానా విధించారు. క్వారీ హద్దులను అతిక్రమించి ఖనిజాన్ని తవ్వినందుకు నలుగురు యజమానులపై రూ.6.11 కోట్లు, వాహనాల పరిశీలనకు సంబంధించి రూ.5.12 లక్షల జరిమానా వేశారు. కరీంనగర్ మైనింగ్ ఏడీ రామాచారి ఆధ్వర్యంలో పలు బృందాలు ఈ సోదాల్లో పాల్గొన్నాయి.

గతంలోనూ ఇదే తంతు..కరీంనగర్ జిల్లాలో గ్రానైట్ అక్రమాలపై ఆది నుంచే వివాదాలున్నాయి. ఫెమా (ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ ఆక్ట్) నిబంధనల్ని అతిక్రమించారనే కేసు ఇంకా నడుస్తూనే ఉంది. గత కొన్నేళ్ల కిందట విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చేపట్టిన తనిఖీల్లోనూ భారీ మొత్తంలో అవకతవకలు వెలుగులోకి వచ్చాయి. నిర్దేశించిన పరిమాణాన్ని మించి గ్రానైట్ రాయిని విదేశాలకు ఎగుమతి చేసినట్లు గుర్తించారు. పూర్తి స్థాయి విచారణ జరిపి ఏ సంస్థ వల్ల ఎంత నష్టం వచ్చిందని లెక్కలేశారు. ఆయా కంపెనీలు పాల్పడిన అక్రమాల లెక్క 149 కోట్ల వరకు గుర్తించి జరిమానా విధించారు. తరువాత సీనరేజీ సహా ఇతరత్రా కలిపి అయిదు రెట్లు అధికంగా చెల్లించాలనే ఆదేశాలు జారీ చేశారు. దాదాపు రూ.750 కోట్ల మొత్తాన్ని కొన్ని ఎగుమతి సంస్థలతోపాటు క్వారీలకు జరిమానా వేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వ హయాంలో ఆ మొత్తం చెల్లించకుండా రూ.11 కోట్లు చెల్లించి చేతులు దులుపుకొన్నారు. తరువాత ఈ విషయంపై కరీంనగర్‌కు చెందిన పలువురు ఈడీకి ఫిర్యాదు చేయడంతో మొదట సీబీఐ విచారణ జరిగింది. తరువాత ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారుల బృందం రంగంలోకి దిగి విచారణ జరిపింది. కరీంనగర్ జిల్లాతోపాటు పెద్దపల్లి జిల్లాలోని పలు క్వారీల యజమానుల ఇళ్లతోపాటు కార్యాలయాల్లో ఏడాది కిందట సోదాలు చేసి కొంత నగదుతోపాటు విలువైన దస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు. తరువాత ఈ కేసు ఇంకా దర్యాప్తు దశలోనే ఉంది. తాజాగా అధికారులు క్వారీలపై దృష్టి పెట్టడంతో కొందరు వ్యాపారుల్లో వణుకు పుడుతోంది. వరుసగా మరి కొన్నిరోజులపాటు ఈ తనిఖీలు జరగనున్నాయి.

# పాలనలో ప్రత్యేకం.. ప్రగతిలో ఉత్తమం

మెట్‌పల్లి: జిల్లాలో పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ముగిసింది. అయిదేళ్ల కాలంలో కొంత మంది సర్పంచులు పాలనలో ప్రత్యేకత కనబర్చి ప్రగతిలో ఉత్తమ గ్రామపంచాయతీలుగా నిలిపారు. గ్రామాభివృద్ధికి అహర్నిశలు పాటుపడి ఆదర్శంగా నిలిచారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన నిధులను సద్వినియోగం చేసుకుని గ్రామాలను అభివృద్ధి బాట పట్టించడమే కాకుండా అవార్డులు పొందారు. ప్రత్యేకత కనబర్చిన గ్రామాలపై ప్రత్యేక కథనం..

స్వచ్ఛత, పచ్చదనంలో ఆదర్శం

మెట్‌పల్లి: స్వచ్ఛతలో, పచ్చదనంలో ఆదర్శంగా నిలిచి పలు పురస్కారాలు, అవార్డులు సొంతం చేసుకుంది మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్ గ్రామ పంచాయతీ. సర్పంచి బద్దం శేఖర్‌రెడ్డి, ఉపసర్పంచి భూమేశ్వర్, పంచాయతీ పాలకవర్గం అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేశారు. ఏడెకరాల స్థలంలో కోతుల ఆహారశాల పల్లె ప్రకృతి వనం, బృహత్ ప్రకృతి వనం ఏర్పాటు చేశారు. ఇక్కడ నిర్మించిన రైతు వేదిక జిల్లాలో ప్రత్యేకంగా నిలిచింది. హరితహారంలో భాగంగా మొక్కల పెంపకం చేపట్టి ముందంజలో నిలిచారు. పల్లె ప్రగతిలో జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీగా, తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా హరితోత్సవంలో పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపునకు కృషి చేసినందుకు ఉత్తమ పంచాయతీగా, దీన్‌దయాల్ ఉపాధ్యాయ్ పంచాయతీ సతత్ వికాస్ పురస్కారంలో భాగంగా మహిళా స్నేహపూర్వక అవార్డును సొంతం చేసుకున్నారు.

యువ చైతన్యం.. కోరుట్ల మండలం నాగులపేట సర్పంచి కేతిరెడ్డి భాస్కర్‌రెడ్డి యువ సర్పంచిగా గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందంజలో నిలిపి జిల్లాలో గ్రామానికి గుర్తింపు తెచ్చారు. ప్రధాన కూడళ్లలో జాతీయ నేతల విగ్రహాలను నెలకొల్పి ఫౌంటెయిన్లను అమర్చి అందంగా తీర్చిదిద్దారు. అరుదైన సైఫన్‌ను పర్యాటక ప్రాంతంగా



మార్చేందుకు పార్కును ఏర్పాటు చేసి పిల్లల కోసం క్రీడా పరికరాలు అమర్చారు. ప్రధాన రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించారు. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ఆధ్వర్యంలో సీబీఐ మాజీ అధికారి జేడీ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా నిజాయతీ సర్పంచిగా అవార్డు అందుకున్నారు. జిల్లా క్లీన్, గ్రీన్ అవార్డు, పల్లె ప్రగతి అవార్డు, ఉత్తమ పంచాయతీగా కలెక్టర్ల చేతుల మీదుగా అవార్డు పొందారు.

పల్లె ప్రగతిలో అత్యుత్తమం

మల్లాపూర్ మండలం సిరిపూర్ గ్రామం అయిదేళ్ల కాలంలో పల్లె ప్రగతిలో అత్యుత్తమంగా నిలిచింది. సర్పంచి భూక్య గోవింద్ నాయక్ కృషితో పరిశుభ్రత, హరితహారంలో ఆదర్శంగా నిలిచి అవార్డులకు ఎంపికైంది. పల్లె ప్రగతిలో ప్రతిభ కనబర్చినందుకు 2020-21లో ఉత్తమ పంచాయతీగా ఎంపికై అప్పటి కలెక్టర్ శరత్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. గ్రామంలో పరిశుభ్రత, మొక్కల పెంపకానికి గాను ఉత్తమ పంచాయతీగా నిలిచి అవార్డు పొందారు. గుడ్ గవర్నెన్స్ అవార్డును అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా అందుకున్నారు.

# పద్దు సంక్షేమ పొద్దు

మెదక్:  అన్నదాతలు, సామాన్యులు మెచ్చేలా కేంద్ర ప్రభుత్వం ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ను రూపొందించింది. మరోసారి రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నట్లు ప్రకటించింది 2024-25 ఆర్థిక సంవత్సరం తాత్కాలిక బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని వివిధ రంగాల్లో బడ్జెట్ లెక్కల ప్రభావంపై ప్రత్యేక కథనం.

పన్ను విధానం కొనసాగింపు

వ్యక్తిగత ఆదాయపు పన్ను విధానానికి సంబంధించి ఈసారి బడ్జెట్‌లో మార్పు చేయలేదు. గతేడాది ప్రతిపాదించిన విధానాన్నే కొనసాగించారు. ఆదాయపన్ను మినహాయింపు పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.7లక్షల వరకు గతేడాది పెంచగా, ప్రస్తుత బడ్జెట్లోనూ  కొనసాగించారు. రూ.7లక్షల వరకు పన్ను భారం లేకుండా రిబేటు ఉంటుందని స్పష్టం చేశారు. కొత్త పన్ను విధానంలో మినహాయింపును రూ.3లక్షలకు పెంచగా, ఈసారి దాన్నే కొనసాగించారు. పాత పన్ను విధానంలో  ఆదాయ పరిమితి రూ.2.50 లక్షలుగానే ఉంటుంది.

విద్యుత్తు బిల్లుల నుంచి విముక్తి కల్పించేందుకు..

విద్యుత్తు బిల్లుల నుంచి సామాన్య ప్రజలకు విముక్తి కలిగించేలా నూతన పథకాన్ని ప్రకటించారు. కోటి ఇళ్లకు నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇచ్చేందుకు సరికొత్త రూఫ్‌టాప్ సోలారైజేషన్ స్కీమ్‌ను తీసుకురానున్నారు. దీనివల్ల ఏటా రూ.15వేల నుంచి రూ.18 వేల వరకు ఆదా అవుతుంది. ఉదాహరణకు నెలకు 200 యూనిట్ల విద్యుత్తు బిల్లు వచ్చే వారు రూఫ్‌టాప్ సోలార్ వేయించుకుంటే రెండు కిలోవాట్ల సౌర పరికరాలు అవసరం. ఇందుకు రూ.75వేల వరకు ఖర్చవుతుంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్ల లోపు వినియోగించే వారికి ఉచితంగా అందిస్తామని ప్రకటించగా, తాజాగా కేంద్ర ప్రభుత్వం 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇవ్వనుంది.

పేద, మధ్యతరగతి వర్గాలకు లబ్ధి చేకూరేలా..

బహిరంగ మార్కెట్‌లో సన్నబియ్యం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. క్వింటాకు రూ.6 వేల నుంచి రూ.7వేల వరకు పలుకుతోంది. ఈ క్రమంలో కేంద్రం పేద, మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరకే బియ్యం అందించాలని నిర్ణయించడం విశేషం. ఇప్పటికే రేషన్ దుకాణాల ద్వారా రూపాయికి కిలో చొప్పున దొడ్డుబియ్యం అందజేస్తున్న విషయం తెలిసిందే. పీడీఎస్ బియ్యాన్ని సన్నగా మార్చి తిరిగి విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో రూ.29లకే భారత్ రైస్ పేరిట ఇవ్వనుండటం గమనార్హం.

పాడి రంగంపై దృష్టిసారించి..

జిల్లాలో అత్యధిక మందికి సేద్యమే జీవనాధారం. వీరు అదనంగా ఉపాధి పొందేందుకు పాడి రంగంపై దృష్టి సారిస్తున్నారు. గేదెల కొనుగోలుకు కేంద్రం ఇప్పటికే పీఎంఈజీపీ పథకాన్ని అమలు చేస్తోంది. రూ.10 లక్షలు, రూ.20 లక్షల యూనిట్లకు 35 శాతం రాయితీ ఇవ్వనున్నారు. ఈ బడ్జెట్లో  పాడిరైతుల ప్రోత్సాహానికి ప్రత్యేక కార్యక్రమం అమలు చేయనున్నట్లు ప్రకటించింది. మరో వైపు వ్యవసాయం రంగంలో కొత్త సాంకేతికతతో విలువ జోడించే విధానాలు తీసుకురానున్నారు.

పెట్టుబడి వ్యయం తగ్గించేలా..

ఏటా వరి రెండు పంటలను సాగు చేస్తుంటారు. దీంతో ఎరువులు, యూరియా వినియోగం ఎక్కువగా ఉంటోంది. కేంద్రం ఇది వరకే నానో యూరియాను అందుబాటులోకి తీసుకురాగా, తాజాగా పంటలకు నానో ఎరువులు అందిస్తామని ప్రకటించింది. ఎరువులు ద్రవరూపంలో అందనున్నాయి. దీని పెట్టుబడి వ్యయం తగ్గనుంది.

మహిళలకు ఆరోగ్య భరోసా

ఇటీవల మహిళలు ఎక్కువగా క్యాన్సర్ బారిన పడుతున్నారు. ముఖ్యంగా మహిళలకు ఎక్కువగా గర్భాశయ క్యాన్సర్‌కు గురవుతున్నారు. ఆరోగ్య మహిళ  కార్యక్రమంలో అత్యధిక మంది ఈ క్యాన్సర్ బారిన పడ్డారు. 9-18 ఏళ్ల బాలికలు ఈ వ్యాధిబారిన పడకుండా చర్యలు తీసుకోనున్నారు. వారికి టీకాలు ఇవ్వనుంది.

సొంతింటి కల సాకారానికి..

ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా ఇప్పటికే ఇళ్ల నిర్మాణం చేపడుతున్న కేంద్రం బస్తీలు, అద్దె ఇళ్లలో నివసించే వారికి సొంతింటి కల సాకారం చేయనుంది. ఇందుకోసం అర్హులైన వారికి ఇళ్ల కొనుగోలు, సొంతింటి నిర్మాణానికి  హౌసింగ్ స్కీమ్‌ను తీసుకురానున్నారు. జిల్లాలో గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణాల్లో అత్యధికులు బస్తీలు, అద్దె ఇళ్లలో నివసిస్తున్నారు. వారికి కేంద్రం తీపికబురు అందించింది.

రూ.5లక్షల ఆరోగ్య బీమా

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు, ఆశా కార్యకర్తలకు ఆయుష్మాన్ భారత్ పథకంలోకి తీసుకొచ్చారు. వీరికి ఏటా రూ.5లక్షల వరకు ఆరోగ్యబీమా వర్తించనుంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందేందుకు ఇది దోహదపడనుంది. నిత్యం వివిధ ప్రగతి నివేదికలు సిద్ధం చేయడంలో, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో అంగన్‌వాడీ కార్యకర్తలే కీలకం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు జరిగేలా ఆశా కార్యకర్తలు కృషిచేస్తుంటారు.

ఎంతో ఉపయుక్తం:  స్వప్న, ఆశా కార్యకర్త, మెదక్

ప్రసవాల లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు నిరంతరం ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తాం. ప్రతి గర్భిణి వివరాలను నమోదు చేసుకుని, ప్రతి నెలా వారికి వైద్యపరీక్షలు అందేలా దృష్టిపెడతాం. ఈ క్రమంలో ఆరోగ్యాన్ని పట్టించుకునే అవకాశం ఉండదు. కేంద్ర ప్రభుత్వం రూ.5లక్షల ఆరోగ్యబీమా కల్పించడం చాలా సంతోషకరం.

ప్రోత్సాహకం అవసరం: రాజిరెడ్డి, పాడి రైతు, గంగాయిపల్లి, శివ్వంపేట వ్యవసాయంతో పాటు అనుబంధ రంగమైన పాడిపై ఆధారపడి జీవిస్తున్నాం. సకాలంలో బిల్లులు, ప్రోత్సాహక డబ్బులు రాక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వ పరంగా ప్రోత్సాహం అవసరం. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మేర లబ్ధి చేకూరుతుందని ఆశిస్తున్నాం.

# పల్లెల్లో ప్రత్యేకాధికారుల పాలన

మెదక్: పంచాయతీల్లో  ప్రత్యేక పాలన అందుబాటులోకి రానుంది. సర్పంచుల పదవీకాలం ముగిసింది. ఈ క్రమంలో ప్రభుత్వం పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించే అవకాశం లేకపోవడంతో వారి స్థానంలో ప్రత్యేక అధికారులను నియమించారు. ముందుగా ఆయా శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించగా,

గజిటెడ్ హోదా ఉన్న వారిని మాత్రమే నియమించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో వారి నియామకం ఆలస్యమైంది. ఆయా మండలాల్లోని పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ అదనపు పాలనాధికారి రమేశ్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని 21 మండలాల్లో 469 పంచాయతీలకు గజిటెడ్ హోదా ఉన్న ఎంపీడీవో, తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, నీటిపారుదల, పంచాయతీరాజ్, మిషన్‌భగీరథ శాఖలకు చెందిన ఏఈలు, మండల వ్యవసాయశాఖ అధికారులు, ఎంపీవోలు, మండల గణాంకశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులను ప్రత్యేకాధికారులగా నియమించారు. వీరు సర్పంచులు విధులను నిర్వహించనున్నారు.

# అభివృద్ధిలో ముందంజ

కొడిమ్యాల: మండలంలోని ఆదర్శ గ్రామం హిమ్మత్‌రావు పేట అభివృద్ధిలో ముందు వరుసలో నిలిచింది. గ్రామంలో శతశాతం మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, సీసీ రోడ్డు, హరితహారం వంటి వివిధ ప్రభుత్వ పథకాలు అమలు చేశారు. అంతేగాక అయిదేళ్లలో సుమారు రూ.3 కోట్ల పైచిలుకు నిధులతో గ్రంథాలయ భవనం, అంగన్‌వాడీ భవన, గ్రామపంచాయతీ భవన మిగులు పని, వివిధ కుల సంఘ భవనాలు, మురుగుకాల్వలు, సీసీరోడ్లు, వైకుంఠధామం, కంపోస్టు షెడ్డు, కోతుల ఆహారశాల, విద్యుత్తు స్తంభాలు, మిషన్ భగీరథ వంటి అభివృద్ధి పనులు చేశారు. 2021-22 గాను గ్రామానికి క్లీన్ అండ్ గ్రీన్ జిల్లా స్థాయి అవార్డుతో పాటు రాష్ట్రస్థాయిలో ఉత్తమ మహిళా స్నేహపూర్వక పంచాయతీ అవార్డు అందుకున్నారు. 2019లో గాంధీ జయంతి సందర్భంగా గుజరాత్‌లో నిర్వహించిన ఉత్సవాలకు ఆహ్వానం అందగా సర్పంచి కృష్ణారావు పాల్గొన్నారు. 2021లో కర్ణాటకలోని మైసూర్‌లో గ్రామపంచాయతీలు అందిస్తున్న సేవలపై జరిగిన జాతీయస్థాయి సదస్సులో తెలంగాణ రాష్ట్రం నుంచి ఏకైక సర్పంచిగా కృష్ణారావు పాల్గొన్నారు.

**రెండు సార్లు ఉత్తమ పంచాయతీగా..**

మండలంలోని ఫకీర్ కొండాపూర్ గ్రామ పంచాయతీ అయిదేళ్లలో రెండు సార్లు జిల్లా స్థాయి ఉత్తమ పంచాయతీగా ఎంపికై ఆదర్శంగా నిలిచింది. గ్రామంలో సుమారు 200 ఇళ్లు ఉండగా, వెయ్యి జనాభా ఉంది. సర్పంచి గుంటి లక్ష్మి గ్రామంలో శతశాతం వ్యక్తిగత మరుగుదొడ్లు, సామాజిక ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ మూత్రశాలలు, పల్లె ప్రకృతి వనం తదితర పనులు చేపట్టి అభివృద్ధికి కృషి చేశారు. వీటితో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయడంలో పాటుపడ్డారు. పల్లె ప్రగతిలో భాగంగా పారిశుద్ధ్యం, పచ్చదనం కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు 2020లో జిల్లా స్థాయి ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపిక కావడంతో అప్పటి జిల్లా కలెక్టర్ శరత్ చేతుల మీదుగా, 2022లో నీరు సరిపోయే గ్రామం, పరిశుభ్రత విభాగాలలో ప్రతిభ కనబరిచి మరోసారి జిల్లా స్థాయి ఉత్తమ పంచాయతీగా ఎంపిక కావడంతో అప్పటి మంత్రి ఈశ్వర్ చేతుల మీదుగా సర్పంచి లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సరిత అవార్డు అందుకున్నారు.

**పంచాయతీల్లో చిన్న...అన్నింటిలో మిన్న**

మండలంలోని మగ్గిడి, ఎడపల్లి చిన్న పంచాయతీ కాగా, పథకాల అమలు, పారిశుద్ధ్యం, తదితర అన్ని విషయాల్లో ఆదర్శంగా నిలుస్తోంది. పంచాయతీ సర్పంచి దుర్గం శ్రీనివాస్, కార్యదర్శి మామిడిపల్లి మహేష్, ఉప సర్పంచి మిగతా పాలకవర్గం సహకారంతో జిల్లా స్థాయిలో అవార్డులను సొంతం చేసుకుంది. జిల్లా స్థాయిలో అత్యధికంగా 60 వేల మొక్కలతో ప్లాంటేషన్లను ఏర్పాటు చేశారు. స్వచ్ఛసర్వేక్షణ్ గ్రామీణ 2023లో జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీగా అవార్డును సాధించారు. ఇద్దరు పంచాయతీ కార్మికులు, మరో ఇద్దరు అదనపు సిబ్బంది మాత్రమే ఉన్నా, ఉత్సాహవంతంగా పారిశుద్ధ్య పనులు స్వచ్ఛతకు మరోపేరుగా నిలిచేలా చేశారు.

# ఉమ్మడి జిల్లాకు మరో కలికితురాయి

నల్గొండ : ఉమ్మడి జిల్లాలో మరో కలుకితురాయి చేరనుంది. యాదాద్రి జిల్లా భూదాన్‌పోచంపల్లి సమీపంలోని స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థను రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్య విశ్వవిద్యాలయంగా మార్చాలని ప్రాథమికంగా నిర్ణయించడంతో.. ఇన్నాళ్లు నిధులు లేక నీరసిస్తున్న గ్రామీణ సంస్థకు పునర్వైభవం రానుంది. ఇక్కడి గ్రామీణ యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. విశ్వవిద్యాలయ ఏర్పాటుపై త్వరలోనే అధికారిక ప్రకటన రానుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఇక్కడ వివిధ ప్రాంతాల నుంచి వచ్చి వివిధ కోర్సుల్లో పనిచేస్తున్న 350 మందికి వసతి లభిస్తుండగా..అధికారిక ప్రకటన అనంతరం సుమారు వేయి మందికి సరిపడా వసతిని కల్పించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిసింది. అయితే గత 12 ఏళ్లుగా సంస్థకు ఛైర్మన్‌తో పాటూ గవర్నింగ్ బాడీ సైతం లేకపోవడంతో విస్తరణ కేంద్రాలు, కొత్త కోర్సులను ప్రవేశపెట్ట లేకపోయారు. తాజా నిర్ణయంతో త్వరలోనే దీనికి ఉపకులపతి (వైస్ ఛాన్సలర్) సైతం నియామకం కానున్నారు.



త్వరలో ఉన్నతాధికారుల పర్యటన

ప్రభుత్వ నిర్ణయంతో పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు వారం పది రోజుల్లో ఇక్కడికి రానున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఇక్కడ ఉన్న మౌలిక వసతులు, ఉమ్మడి రాష్ట్రంలో ఈ సంస్థ పరిధిలో ఉన్న 38 విస్తరణ కేంద్రాలతో పాటూ అక్కడ కొనసాగుతున్న కోర్సులపై త్వరలోనే సమీక్ష నిర్వహించనున్నట్లు సమాచారం. విశ్వవిద్యాలయానికి సరిపడా మౌలిక వసతులు ఇంకా ఏం కావాలి, అందుకు ఎన్ని నిధులు అవసరం అవుతాయన్న దానిపైనా సంబంధిత అధికారులు గ్రామీణ సంస్థ అధికారులు, సిబ్బందితో చర్చించనున్నట్లు ఓ అధికారి వెల్లడించారు. విశ్వవిద్యాలయం ఏర్పాటు అనంతరం ప్రస్తుతం మార్కెట్లో డిమాండ్ ఉన్న కోర్సులను ఇక్కడా ప్రవేశపెట్టి గ్రామీణ విద్యార్థులకు వసతితో పాటూ శిక్షణను ఇప్పించడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు.

# వనంలోకి..జనం ఎప్పుడో..?

చౌటుప్పల్ : పట్టణ ప్రజలు సేదతీరేందుకు చౌటుప్పల్ తొమ్మిదో వార్డు పరిధిలోని అంజనాసాయి కాలనీలో ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. పురపాలిక గ్రీన్ బడ్జెట్ నుంచి నిధులు కేటాయించి ఇందులో అలంకరణ మొక్కలు పెంచారు. పిల్లలు ఆడుకునేందుకు రకరకాల ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కాలనీవాసుల వ్యాయామంకోసం కాలి నడక మార్గం కూడా ఈ వనంలో నిర్మించారు. రెండున్నర ఏళ్ల క్రితం రూ.లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ ప్రకృతి వనాన్ని ఇప్పటికీ అధికారికంగా ప్రారంభించనే లేదు. నెలలో రెండుమూడు పర్యాయాలు ట్యాంకరుతో తెచ్చి నీళ్లు పోసి మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్త పడుతున్నారు. ప్రకృతి వనం ద్వారానికి తాళం వేసి ఉంటుంది. ప్రజలను అందులోకి అనుమతించడం లేదు. అలంకారప్రాయంగా ఉంది. ప్రకృతి వనం లోపల పిచ్చిమొక్కలు పెరిగాయి. లోపలి కాలి బాట పిచ్చిమొక్కలతో మూసుకుపోయింది. ఆట వస్తువులు తుప్పు పట్టి శిథిలమై పోతున్నాయి.

# యువతకు నైపుణ్య వికాసం



పెద్దపల్లి: 'యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు రాష్ట్రంలోనే తొలి 'టాస్క్(తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్)'ను పెద్దపల్లిలో ఏర్పాటు చేస్తాం. ఉద్యోగ, ఉపాధి రంగాల్లో నైపుణ్య శిక్షణ అందించేందుకు ఐటీ నిపుణులను నియమిస్తాం. ఇందుకోసం జిల్లా కలెక్టర్ స్థల సేకరణ చేపట్టాలి. వారం రోజుల్లో ఐటీ బృందం సమగ్ర నివేదికలు రూపొందిస్తుంది. శిక్షణతో పాటు కొలువు

జిల్లాలో ఇంజినీరింగ్-2, డిగ్రీ-7, పీజీ-1, డిప్లొమా-1, ఫార్మసీ-1 కళాశాలల్లో ఏటా వేల మంది విద్యార్థులు చదువు పూర్తి చేసుకుంటున్నారు. పోటీ పరీక్షలకు అవసరమైన నైపుణ్యం లేక ఉద్యోగ వేటలో వెనుకబడుతున్నారు. ఐటీ కంపెనీల్లో అపారమైన ఉద్యోగావకాశాలున్నా ఆ దిశగా విద్యార్థులను సన్నద్ధం చేయడంలో కళాశాలల యాజమాన్యాలు ప్రయత్నించడం లేదు. ఈ క్రమంలో కళాశాల విద్యకు, పారిశ్రామిక అవసరాలకు మధ్య అవకాశాలు కోల్పోతున్న యువతకు టాస్క్‌ను స్థానికంగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ అనంతరం తక్షణమే ఉద్యోగం కల్పించడమే లక్ష్యంగా చర్యలు చేపట్టారు.

బహుళజాతి సంస్థలతో ప్రత్యేక ప్రణాళిక

ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు టాస్క్‌లో భాగస్వాములయ్యేలా చర్యలు చేపట్టనున్నారు. నిరుద్యోగుల్లో నైపుణ్యం పెంపొందించి ఉద్యోగావకాశాలు కల్పించడమే కార్యక్రమ లక్ష్యం. విద్యార్థులకు అవసరమైన వనరులు, శిక్షణ అందించి దిగ్గజ కంపెనీల్లో ఉపాధి కల్పించనున్నారు. ఇంజినీరింగ్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఎంబీఏ, ఫార్మసీ తదితర కోర్సులు పూర్తి చేసిన వారికి కల్పించే ఉద్యోగాలపై బహుళ జాతి సంస్థల ప్రతినిధులతో కలిసి ప్రత్యేక ప్రణాళిక రూపొందించనున్నారు. పారిశ్రామిక అవసరాలు.. ఆశిస్తున్న నైపుణ్యాల వివరాలను విద్యార్థులకు వివరిస్తారు. గ్రామీణ విద్యార్థులు ఆంగ్లంపై పట్టు లేక అవకాశాలు కోల్పోతున్నారు. వారు ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడేలా తీర్చిదిద్దేలా శిక్షణ కార్యక్రమాలపై దృష్టి సారించనున్నారు. మానసిక ఒత్తిడి తగ్గించేందుకు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించేలా తరగతులు నిర్వహించనున్నారు.

మంత్రి ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో టాస్క్ ఏర్పాటుకు కసరత్తు ప్రారంభమైంది. ఇప్పటికే బస్టాండ్ ప్రాంతంలోని పాత కలెక్టరేట్(ఐటీఐ కళాశాల) భవనాన్ని ఎంపిక చేస్తే ఎలా ఉంటుందంటూ అధికారులతో కలెక్టర్ ముజామిల్‌ఖాన్ చర్చించారు. మరోవైపు పట్టణం నడిబొడ్డున అందరికీ అందుబాటులో ఉండేలా కేంద్రం ఏర్పాటుకు సంబంధించి సాధ్యాసాధ్యాలపైనా పరిశీలిస్తున్నారు. హైదరాబాద్, బెంగళూరు వంటి మెట్రో నగరాల్లో బహుళ జాతి సంస్థలు టాస్క్ శిక్షణాలయాలను నిర్వహిస్తున్న నేపథ్యంలో వాటిని కూడా ఇందులో భాగస్వాములను చేసేలా చర్చలు జరుగుతున్నాయి. టాస్క్‌కు ఎంపికయ్యే నిరుద్యోగ యువత అర్హతలు, ప్రాధాన్యం, సాంకేతికత, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు తదితర అంశాల్లో తర్ఫీదు ఎలా ఇవ్వాలనే అంశాలను కూడా పరిగణనలోకి తీసుకునే అవకాశాలపై కలెక్టర్ ఇతర ఉన్నతాధికారులతో సమాలోచనలు జరుపుతున్నారు.

# బొగ్గు ఉత్పత్తి లక్ష్యం చేరేనా?



గోదావరిఖని: సింగరేణి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరం బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించేందుకు ఇంకా రెండు నెలల సమయం ఉంది. మార్చి నాటికి ముగియనున్న ఆర్థిక సంవత్సరంలో 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఆర్థిక సంవత్సరానికి మిగిలిన రెండు నెలల్లో భారీ మొత్తంలో బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉంది. వాటిని అధిగమిస్తేనే వార్షిక లక్ష్యం చేరుకునే అవకాశం ఉంది. సింగరేణి సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరంలో 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. జనవరి ముగిసే నాటికి 56.30 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించగా మిగిలి రెండు నెలల్లో 13.70 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధిస్తేనే లక్ష్యాన్ని చేరుకునే అవకాశం ఉంది. సింగరేణిలో ఇప్పటి వరకు 62.22 మిలియన్ టన్నుల బొగ్గు వెలికి తీయాల్సి ఉండగా లక్ష్యానికి 5.92 మిలియన్ టన్నుల ఉత్పత్తి వెనుకంజలో ఉంది. మిగిలిన రెండు నెలల్లో మరింత వేగంగా పనిచేస్తే ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకునే అవకాశం ఉంది. ఈ ఏడాది వర్షాలు ఎక్కువగా కురవడంతో ఉపరితల గనుల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. దీనివల్ల కూడా గడచిన 10 నెలల్లో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోలేకపోయింది.

**సమ్మక్క జాతర ప్రభావం**

బొగ్గు ఉత్పత్తిపై ఈ నెల సమ్మక్క సారలమ్మ జాతర ప్రభావం పడనుంది. నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి చేరువయ్యేందుకు నెలకు 6.75 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధిస్తే లక్ష్యాన్ని చేరుకునే అవకాశం ఉంటుంది. అంటే రోజుకు 2.35 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించాల్సి ఉంది. ఫిబ్రవరి, మార్చి నెలల్లో మొత్తం 59 రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఇందులో ఎనిమిది రోజులు వారాంతపు సెలవుల కింద పోయే అవకాశం ఉంది. మధ్యలో సమ్మక్కసారలమ్మ జాతర ప్రభావం ఉంటుంది. ఈనెల 21 నుంచి 24 వరకు జాతర జరగనుండటంతో కార్మిక కుటుంబీకులు ఎక్కువగా మొక్కులు తీర్చుకుంటారు. ఆరోజు సెలవుల్లో వెళ్లడంతో ఉత్పత్తిపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది.

నాలుగు డివిజన్లు వంద శాతం

సింగరేణి మొత్తంలో నాలుగు డివిజన్లు మాత్రమే వందశాతం బొగ్గు ఉత్పత్తి చేశాయి. 10 నెలల్లో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నాలుగు డివిజన్లు మాత్రమే అధిగమించాయి. ఇల్లెందు, మణుగూరు, బెల్లంపల్లి, రామగుండం-3 డివిజన్లు వందశాతం మించాయి. మిగతా డివిజన్లు సైతం ఉత్పత్తిని అధిగమిస్తే సింగరేణి వార్షిక లక్ష్యాన్ని చేరుకునే అవకాశం ఉంది. రామగుండం-1, 2, కొత్తగూడెం డివిజన్లు 94 నుంచి 98 శాతం బొగ్గు ఉత్పత్తితో సాధించి వంద శాతానికి చేరువగా ఉన్నాయి. మిగతా డివిజన్లలో బొగ్గు ఉత్పత్తి పుంజుకుంటే రెండు నెలల్లో వార్షిక లక్ష్యాన్ని అధిగమించడానికి అవకాశం ఉంది.

# మంచినీళ్లు తాగేదెలా?

కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని అశోక్‌నగర్ జెండా చౌరస్తా వీధిలో మంచినీళ్లకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతంలో సుమారు వంద ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఉండగా మూడు నెలలుగా ఇబ్బందులు పడుతున్నారు. నల్లా నీరు వచ్చినప్పుడు దుర్గంధంగా, రంగు మారిన శుద్ధి నీరు సరఫరా అవుతుండటంతో కనీసం ఇతర అవసరాలకు కూడా పట్టుకోలేని పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని నీటి విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కావడంలేదని ఆ ప్రాంతవాసులు ఆగ్రహిస్తున్నారు.

మూడు చోట్ల తనిఖీలు మురుగునీరు వస్తుందనే ఫిర్యాదు మేరకు ఆ ప్రాంతంలో నీటి విభాగం అధికారులు పరిశీలించి మూడు చోట్ల సీసీ రోడ్డు తవ్వారు. లీకేజీలకు మరమ్మతు చేశారు. డమ్మీ తెరిచి మురుగు నీరంతా తొలగించారు. అయినా ఎప్పటిలాగే తాగు నీరు సరఫరా అవుతుండటంతో అయోమయంలో పడ్డారు. డ్రైనేజీ నీరు ఎక్కడ కలుస్తుందో తెలియకుండా మారింది. పైగా అటు, ఇటు రెండు గల్లీలకు ఎలాంటి వాసన లేకుండా శుద్ధజలం సరఫరా అవుతున్నట్లుగా స్థానికులు చెప్పారు. ఈ ఒక్క గల్లీలోనే సమస్య ఉందంటున్నారు. ఇలాంటి అనుమానాల మధ్య ఆ నీటిని ఎలా వాడతారని ప్రశ్నిస్తున్నారు. ఇటీవల ఈ ప్రాంతంలో కొత్తగా సీసీ రోడ్డు వేయగా లీకేజీలు అధికంగా ఉన్నాయని, పైపులైను మార్చాలని ఆ ప్రాంతవాసులు విజ్ఞప్తులు చేసినా పట్టించుకోలేదు. పనులన్నీ పూర్తయిన తర్వాత ఒక్కొక్కటిగా బయట పడుతుండగా నూతన సీసీ రోడ్డు గుంతలు పడేలా తయారైంది.

మొదట్లోనే గుర్తించకపోవడం



కొత్త పైపులైను వేసే సమయంలో ముందుగా నీటిని వదిలి పరీక్షలు చేసిన తర్వాతే రోడ్డు, కల్వర్టులు నిర్మించాల్సి ఉండగా అవేవి సంబంధం లేకుండా చకచకా పనులు చేపట్టారు. అశోక్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ఇంటి ముందు నడకదారి కింద పైపులైను ఉంది. జాయింట్ల మధ్య నీరు బయటకు వస్తుందని తెలిసినా మరమ్మతు చేయకుండా టైల్స్ పనులు చేసి కప్పేశారు. తాగునీరు కలుషితం అవుతుందనే ఫిర్యాదులు వస్తే అలాంటివి దొరకపోవడంతో నెలల తరబడి అలాగే ఉంటున్నాయి. ఇబ్బందులు పడుతున్నాంగత కొన్ని నెలలుగా నల్లా ద్వారా డ్రైనేజీ నీళ్లు రావడం, ఆ దుర్వాసనతో ఆ నీరు పట్టుకోవడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మూడు చోట్ల తవ్వినా లాభం లేకుండా పోయింది. డబ్బా నీళ్లే దిక్కుగా మారింది. ఇతర అవసరాలకు నానావస్థలు పడాల్సి వస్తోంది.ఎ త్వరగా పరిష్కరించాలి.- భాగ్య, అశోక్‌నగర్ నివాసి

# ఇక పంచాయతీల పాలన ప్రత్యేకం

ఖమ్మం : గ్రామపంచాయతీల్లో ప్రజల ద్వారా ఎన్నికైన సర్పంచులు, పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. ఇప్పట్లో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించే పరిస్థితులు లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం సర్పంచుల స్థానంలో ప్రత్యేకాధికారులకు పరిపాలన పగ్గాలు అప్పగించింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారులు శుక్రవారం నుంచి బాధ్యతలు చేపట్టనున్నారు. కొత్త పాలకవర్గాలు కొలువుదీరే వరకు పాలన సాగించనున్నారు.

గెజిటెడ్ అధికారులకే పగ్గాలు

మేజర్ గ్రామ పంచాయతీలకు తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఎంపీడీఓలను నియమించేలా.. మిగిలిన వాటి బాధ్యతలను ఎంపీఓలు, ఏఈఓలు, ఎంఈఓలకు అప్పగించేలా ఆయా జిల్లాల అధికార యంత్రాంగం జాబితా రూపొందించింది. అయితే గెజిటెడ్ అధికారులను మాత్రమే ప్రత్యేకాధికారులుగా నియమించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయటంతో నాన్ గెజిటెడ్ అధికారులను పరిగణనలోకి తీసుకోలేదు. ఉభయ జిల్లాల్లోని గ్రామ పంచాయతీలకు సరిపడా గెజిటెడ్ అధికారులు లేరు. అందుకే ఒక్కో అధికారికి రెండు, మూడు గ్రామపంచాయతీల పాలన బాధ్యతలు అప్పగించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు.

సహాయకులుగా కార్యదర్శులు

సాధారణంగా గ్రామ పంచాయతీల పాలనలో సర్పంచికి సహాయకులుగా ఉప సర్పంచి వ్యవహరిస్తారు. అభివృద్ధి నిధుల ఖర్చుకు




సంబంధించి వారిద్దరికే జాయింట్ చెక్‌పవర్ ఉంటుంది. పంచాయతీల్లో వారి పదవీకాలం పూర్తవటంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. అయితే వీరికి పాలనలో సహాయకులుగా పంచాయతీ కార్యదర్శులు ఉండనున్నారు. వీరిద్దరికీ జాయింట్ చెక్ పవర్ ఉంటుంది. ఇక నుంచి పంచాయతీల్లో గ్రామసభలు, సమావేశాలు ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో జరగనున్నాయి. సాధారణంగా సర్పంచులకు ఉండే అధికారాలే ప్రత్యేకాధికారులకు సంక్రమిస్తాయని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

హైకోర్టు నిర్ణయంతో..

గ్రామ పంచాయతీల పాలకవర్గాల పదవీకాలాన్ని పొడిగించాలన్న సర్పంచుల అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చటంతో ప్రత్యేకాధికారుల పాలనకు మార్గం సుగమమైంది. పాలకవర్గాల పదవీకాలం ముగుస్తున్నా ఎన్నికలు నిర్వహించకపోవటాన్ని సవాల్ చేస్తూ కొందరు సర్పంచులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. పదవీకాలం పొడిగించాలనే అభ్యర్థనను తిరస్కరించింది. తదుపరి విచారణను వాయిదా వేయటంతో గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలనకు ప్రభుత్వం మొగ్గుచూపింది.

పారదర్శకతకు పెద్దపీట


గ్రామ పంచాయతీల్లో ప్రజాప్రతినిధుల పదవీకాలం పూర్తైతే కొత్త పాలకవర్గాలు ఎన్నికయ్యే వరకు ప్రత్యేకాధికారులతో పరిపాలన సాగించాలని చట్టం చెబుతోంది. ఇందులో గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారులనే అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించలేదు. గతంలో గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారులు అనే తేడా లేకుండా అందరూ ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు నిర్వర్తించిన సందర్భాలున్నాయి. అయితే తాజాగా గెజిటెడ్ అధికారులే ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించటం విశేషం. పంచాయతీల పాలనలో పారదర్శకతకు పెద్దపీట వేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అనుభవమున్న అధికారులకు పాలన పగ్గాలు అప్పగిస్తే అభివృద్ధి పనులు సజావుగా సాగటంతో పాటు నిధులు దుర్వినియోగం కాబోవని సర్కారు భావిస్తోంది.

# ప్రైవేటులో అధికం.. సర్కారు బడిలో గగనం..!

ఖమ్మం : వివిధ యాజమాన్యాల పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి అంతర్గత మార్కుల పరిశీలన ప్రక్రియ ప్రారంభమైంది. అన్ని మండలాల్లో బృందాలు పాఠశాలలను సందర్శించి మార్కులను తనిఖీ చేశాయి కార్యక్రమం కొనసాగుతుంది. ఈ విధానంలో విద్యార్థులు అధిక శాతం రాతపనే చేయాల్సి ఉంటుంది. అందుకే ప్రధాన పరీక్షల కోసం సన్నద్ధమయ్యేందుకు విద్యార్థులకు సమయం సరిపోవటం లేదని ఉపాధ్యాయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

ఖమ్మంలో షురూ.. భద్రాద్రిలో 13 నుంచి

ఖమ్మం జిల్లాలో మార్కులను తనిఖీ చేసేందుకు విద్యాశాఖ ప్రత్యేకంగా 58 బృందాలను ఏర్పాటు చేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పరిశీలన ప్రక్రియ ఫిబ్రవరి 13, 14, 15వ తేదీల్లో నిర్వహించ



నున్నారు. అక్కడా సుమారు 58 బృందాలను నియమించనున్నారు. ప్రతి బృందంలో ఒక సీనియర్ ప్రధానోపాధ్యాయుడు, ముగ్గురు సబ్జెక్టు నిపుణులు ఉంటారు. తెలుగు, హిందీ సబ్జెక్టులకు ఒకరు, ఇంగ్లిషు, గణితం సబ్జెక్టుకు మరొకరు, సాంఘికశాస్త్రం, సామాన్య శాస్త్రం సబ్జెక్టులకు ఇంకొకరు చొప్పున ఉంటారు. స్థానిక ఎంఈఓల సహకారంతో ఈ బృందాలు పనిచేస్తాయి. డీసీఈబీ కార్యదర్శి నారాయణ దీనికి సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. 20 మార్కుల పరిశీలన...

నిర్మాణాత్మక మూల్యాంకనం విధానంలో 20 మార్కులకు పరీక్షలు నిర్వహిస్తారు. వార్షిక పరీక్షల్లో 80 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. మిగతా 20 మార్కులను ఉపాధ్యాయులే కేటాయిస్తారు. తనిఖీలకు వెళ్లిన బృందాలు ఉపాధ్యాయులు మార్కులను సరిగ్గా వేశారా లేదా పరిశీలిస్తాయి. తనిఖీల పరిస్థితి గమనిస్తే సర్కారు బడుల విద్యార్థుల మార్కులు దారుణంగా ఉంటాయి. ఆశించిన మేరకు సామర్థ్యాలు ఉండవనే కారణంతో తక్కువ వేస్తుంటారు. 50 మంది విద్యార్థుల్లో ఒక్కరికీ 20/20 లభించటం అరుదు. ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు అధిక శాతం 20 మార్కులు లభిస్తుండటం గమనార్హం.

# వానమ్మా.. వచ్చిపోవమ్మా!

ఖమ్మం: జిల్లావ్యాప్తంగా కరవు పరిస్థితులు నెలకొంటున్నాయి. ఖరీఫ్ సీజన్ ఆరంభమై 40 రోజులు అవుతున్నా గట్టి వాన కురిసిన జాడ లేదు. జల వనరుల్లోకి వరద ప్రవాహం కొనసాగిన ఆనవాళ్లు లేవు. వరుణుడి కరుణ కోసం జిల్లా వాసులు ఆకాశం వైపు చూస్తున్నారు. జూన్ నెల పూర్తిగా.. జులైలో ఇప్పటి వరకు జిల్లాలో ఎక్కడా చెప్పుకోదగిన స్థాయిలో వర్షం కురవలేదు. దీంతో చెరువులు అడుగంటుతున్నాయి. వర్షాభావ పరిస్థితులతో రోజురోజుకు నీటి మట్టం పడిపోతోంది. మండే ఎండలకు ఉన్న నీరు ఆవిరవుతోంది. జిల్లాలో 983 చెరువులు ఉన్నాయి. వాటిలో 771 తటాకాల్లో నీటిమట్టం 25



శాతం కంటే తక్కువగా ఉంది. మిగతావాటిలో కొంత నీరున్నా.. వర్షాలు కురవక వేగంగా మట్టం పడిపోతోంది. గత ఏప్రిల్‌లో సాగర్ కాలువ బంద్ చేసే ముందు చాలా చెరువులను నిండుగా నింపారు. దీంతో ఇప్పటిదాకా కొన్నింటిలో కాస్తైనా జలకల ఉంది. లేకుంటే అవీ పూర్తిగా ఎండిపోయేవే. వేసవిలో చేపలు పట్టేందుకు చాలా చెరువుల్లో నీరు వృథాగా వదిలేయగా అవి ఖాళీ అయ్యాయి. వర్షాభావ పరిస్థితులు మరికొన్ని రోజులు కొనసాగితే గ్రామాల్లో పశువులకు తాగునీటి కొరత ఏర్పడే ప్రమాదం పొంచిఉంది. చెరువులు పూర్తిగా ఎండిపోతే పశువులు, గొర్రెలు, మేకలు సహా ఇతర జంతువులకు దాహార్తి తీర్చుకునే దారి ఉండదు. కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం ఇప్పటి వరకు దృష్టి సారించనే లేదు.

# ఆబ్కారీ శాఖ బదిలీల్లో.. రాజకీయ పైరవీలు?




ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆబ్కారీ శాఖలో బదిలీలు, పదోన్నతుల పోస్టింగుల (ఎస్సైలకు సీఐగా) ప్రక్రియ సైతం రాజకీయ పైరవీలకు కేంద్రంగా మారిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలువురు అధికారులు బదిలీల్లో నచ్చిన స్థానం కోసం కొందరు అధికార పార్టీ ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండటం గమనార్హం. పోలీసు ఎస్సై, సీఐల మాదిరిగా ఆబ్కారీలోనూ సిఫారసు లేఖలు ఇస్తుండటం తాజాగా చర్చనీయాంశమైంది. ఇందుకోసం ముడుపులు సైతం చేతులు మారుతున్నట్లు ఆ శాఖలో చర్చ జరుగుతోంది.

ఖమ్మంలో 7, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 6 ఆబ్కారీ పోలీస్ స్టేషన్లు కొనసాగుతున్నాయి. ఆయా స్టేషన్ల పరిధిలో దాదాపు 210 మద్యం దుకాణాలు నిర్వహిస్తున్నారు. ఏటా మద్యం అమ్మకాల ద్వారా ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.3 వేల కోట్ల ఆదాయం సమకూరుతోంది. ఈ శాఖలో ఎస్సైలు, సీఐలు, ఆ పైస్థాయి అధికారులకు మూడేళ్లకోసారి శాఖాపరమైన బదిలీలు జరుగుతుంటాయి. ఈ ప్రక్రియకు నేర నియంత్రణ, మద్యం అమ్మకాల ద్వారా సమకూరిన ఆదాయం, ఇతర అంశాలను ప్రాతిపదికగా తీసుకునేవారు. కానీ ప్రభుత్వం గత ఆరేళ్లుగా సాధారణ బదిలీలు చేపట్టలేదు. చివరి సారిగా ఉమ్మడి జిల్లాలో 2017లో ఈ ప్రక్రియ జరిగింది. ఆ తర్వాత అడపాదడపా శాఖాపరమైన మార్పుల్లో భాగంగా అతికొద్ది బదిలీలు, పదోన్నతుల పోస్టింగులు మాత్రమే కల్పించారు.

ఎక్కడ చూసినా అదే చర్చ.. రచ్చ

ఆరేళ్ల వ్యవధి తర్వాత ఉభయ జిల్లాల్లో నెల రోజులుగా బదిలీలు, పోస్టింగుల వ్యవహారం జోరందుకుంది. ఈ ప్రక్రియలో మితిమీరిన రాజకీయ జోక్యం, ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లు ఆ శాఖలో చర్చనీయాంశంగా మారాయి. సుమారు పది స్టేషన్ల పరిధిలో ఈ విషయమై చిచ్చు రగులుతోంది. నచ్చిన స్థానాల్లో పోస్టింగుల కోసం అధికారుల తరఫున ఏకంగా స్థానిక ప్రజాప్రతినిధులు రంగంలోకి దిగారు. వారు సిఫారసు లేఖలు ఇస్తుండటంతో కొందరు అధికారులు బారులుదీరుతున్నారు. ఒకరిని మించి మరొకరు నచ్చిన చోట పోస్టింగు దక్కించుకునేందుకు సర్వశక్తులొడ్డుతున్నారు. ఒకరిద్దరు తాము అనుకున్న పోస్టుకు వెళ్లడంతో.. మిగతావారూ గత మూడు వారాలుగా అదే ప్రయత్నాల్లో మునిగితేలుతున్నారు. ఫలితంగా ఏ స్థానంలోకి ఎవరు వస్తారోనన్న ఉత్కంఠ ఆబ్కారీ స్టేషన్లలో నెలకొంది. ఉన్నతాధికారుల ఆశీస్సులు, రాజకీయ పలుకుబడితో కొందరు తమ స్థానాన్ని పదిలం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అవసరమైతే సామాజిక సమీకరణాలను తెరపైకి తెచ్చి లాబీయింగ్ చేస్తున్నట్లు సమాచారం. అనుకున్న పని జరిగేందుకు రూ.లక్షల్లో ముడుపులు కట్టబెట్టేందుకు వెనుకాడటం లేదన్న చర్చ జరుగుతోంది. ఈ ప్రయత్నాలతో కొందరు అసలు విధులనే పక్కనబెట్టారన్న చర్చ జరుగుతోంది.

ఆబ్కారీ బదిలీల్లో రాజకీయ పైరవీల పాత్రపై ఉమ్మడి జిల్లా డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డిని 'ఈనాడు' వివరణ కోరగా అంతా శాఖ నిబంధనల ప్రకారం పారదర్శకంగా జరుగుతుందన్నారు. ఒత్తిళ్లు, రాజకీయ సిఫార్సులకు తావే లేదని ఆరోపణలు కొట్టిపారేశారు. ఇటీవల ఖమ్మం జిల్లాలోని రెండు ఆబ్కారీ స్టేషన్లలో పరస్పర బదిలీల ఉత్తర్వులు వెలువడ్డాయి. మళ్లీ అదేరోజు వాటి ఉపసంహరణ ఉత్తర్వులూ వెలువడటం గమనార్హం. అప్రాధాన్య పోస్టులు దక్కిన కొందరు సీఐలు బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేయడం, ఇది ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడం బదిలీల నిలిపివేతకు కారణమైంది.

ఇటీవల భద్రాద్రి జిల్లాలో ఓ అధికారిని టాస్క్‌ఫోర్స్ సీఐగా బదిలీ చేయగా ఆయన అక్కడ చేరలేదు. రాజకీయ పలుకుబడితో వారంలోపే అదే జిల్లాలో ప్రాధాన్యం గల మరో పోస్టు తెచ్చుకున్నారు.

# రాచమార్గాలు.. విస్తరణకు అడుగులు

మహబూబాబాద్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలో రవాణా వ్యవస్థను మెరుగుపరిచేలా జాతీయ రహదారుల విస్తరణ పనులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకు రూ.5,588 కోట్లు కేటాయించింది. జగిత్యాల-ఖమ్మం కారిడార్‌లోని కరీంనగర్- వరంగల్ 563వ జాతీయ రహదారి, నాగ్‌పూర్-విజయవాడ కారిడార్ మధ్య మంచిర్యాల-హనుమకొండ వరకు గ్రీన్‌ఫీల్డ్ 163జీ రహదారి విస్తరించనుంది. ఈ పనులకు స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. రహదారుల విస్తరణతో అభివృద్ధి పరుగులు పెట్టనుంది. ఇండస్ట్రియల్ కారిడార్ మెరుగుపడుతుంది. వాహనదారులకు సమయం ఆదా అవుతుంది. వ్యయభారమూ తగ్గుతుంది. 2025-26 నాటికి పూర్తి చేసేలా గడువు విధించారు. అనుకున్నట్లుగా పనులు సమయానికి పూర్తి చేస్తే అంతర్రాష్ట్ర కనెక్టివిటీ మెరుగుపడుతుంది. కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి జగిత్యాల నుంచి ఖమ్మం వరకు విస్తరించి ఉంది. రెండు వరుసలతో 244.1 కి.మీ. దూరమున్న ఈ రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు. తొలుత కరీంనగర్-వరంగల్ సెక్షన్ల మధ్య మానకొండూరు బైపాస్ నుంచి హసన్‌పర్తి మండలం పలివేల్పుల వరకు 68 కి.మీ. మేర విస్తరించేందుకు నిధులు కేటాయించారు. భూసేకరణ ప్రక్రియను చేపట్టి 60 శాతానికిపైగా పూర్తి చేశారు. భూ నిర్వాసితులకు పరిహారం అందిస్తారు. రహదారి విస్తరణలో 45 కి.మీ. మేర బాహ్యవలయ రహదారి ఏర్పాటు కానుంది. ఈ మార్గం 45 నుంచి 60 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తుండగా రెండు జిల్లాల పరిధిలోని 30 గ్రామాలకు మేలు జరగనుంది. వాహనదారులు విశ్రాంతి తీసుకునేందుకు, రోడ్డు పక్కన వాహనాలు నిలిపేందుకు ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు.

ప్రస్తుతం విస్తరణ చేయనుంది : 68 కిలోమీటర్లు

కేటాయించిన నిధులు: రూ.2,147 కోట్లు

బైపాస్‌ల నిర్మాణం: 5 (మానకొండూర్, తాడికల్, హుజూరాబాద్, ఎల్కతుర్తి, హసన్‌పర్తి పరిధిలో) ప్రధాన వంతెనలు: 9, చిన్నవి: 20, లి పై వంతెనలు (ఆర్వోబీ): 1, లి వాహనాల అండర్ పాస్‌లు (వీయూపీ): 21, చిన్న వాహనాల అండర్ పాసులు(ఎల్‌వీయూపీ): 6, రోడ్డు అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ): 1, పాదచారుల అండర్‌పాసు: 1ప్రయోజనాలు: ఇండస్ట్రియల్ కారిడార్ మెరుగుపడుతుంది. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు సులువుగా వెళ్లొచ్చు. ప్రధాన పట్టణాలకు వెళ్లడానికి బైపాస్‌లు అనుకూలంగా ఉంటాయి. ప్రధానంగా రామప్ప, మేడారం, బొగత జలపాతం లాంటి పర్యాటక ప్రాంతాలకు వెళ్లడానికి వీలుగా ఉంటుంది. స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయి.

మూడు రాష్ట్రాలకు అనుసంధానం

మూడు రాష్ట్రాలను అనుసంధానం చేస్తూ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణ పనులు మొదలయ్యాయి. నాగ్‌పూర్-విజయవాడ కారిడార్‌లోని మంచిర్యాల-వరంగల్ జిల్లాలను కలుపుతూ నాలుగు వరుసల రహదారి నిర్మాణం ప్రారంభం కానుంది. ప్రధానమంత్రి గతి శక్తి పథకంలో రూ.3,441 కోట్లను కేటాయించారు. 108 కి.మీ. మేర నిర్మించే రహదారిని మూడు విభాగాలుగా విభజించారు. వరంగల్ జిల్లాకు పలు ప్రయోజనాలు కలగనున్నాయి. మంచిర్యాల నుంచి వరంగల్ వరకు 34 కి.మీ. దూరం తగ్గనుంది. జాతీయ రహదారి 45, 65లపై రద్దీ తగ్గడంతో పాటు జిల్లావాసులకు రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయి.

విభాగాల వారీగా: మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం నర్వ నుంచి పెద్దపల్లి జిల్లా మంథని మండలం పుట్టపాక వరకు 31 కి.మీ. పనులు చేస్తారు. నీ పెద్దపల్లి జిల్లా మంథని మండలం పుట్టపాక నుంచి భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం పంగిడిపల్లె వరకు 38 కి.మీ. నీ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం పంగిడిపల్లె నుంచి హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండ వరకు 39 కి.మీటర్ల మేర పనులు చేయనున్నారు.

అంతర్గత మార్పులు: 11 విశ్రాంతి ప్రాంతాలు: 4

ప్రయోజనాలు: మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య అంతర్రాష్ట్ర సంబంధాలు మరింత పెరుగుతాయి. నాగ్‌పూర్- విజయవాడ మధ్య 178 కి.మీ. దూరం తగ్గుతుంది. ప్రధాన రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు, ఓడరేవులతో బహుళ మోడల్ కనెక్టివిటీ మెరుగుపడు తుంది.

# కిన్నెరసాని.. లీకేజీల కహానీ

కొత్తగూడెం : జంట పట్టణాలుగా పేర్కొనే కొత్తగూడెం, పాల్వంచ పురపాలకాల ప్రజలను నిత్యం వేధించే సమస్యల్లో 'తాగునీరు' ముందుంటుంది. '24ఐ7 సరఫరా' అంటూ అధికారులు, ప్రజాప్రతినిధుల ఊకదంపుడు ఉపన్యాసాలు ఓవైపు.. 'మంచినీరు మహాప్రభో' అంటూ బాధిత కాలనీల ప్రజల ఘోష మరోవైపు ఇక్కడ షరా మామూలైంది. పైపులైన్ల ద్వారా సరఫరా అవుతున్న కిన్నెరసాని తాగునీటి పథకం శుద్ధిజలాలు భారీ లీకేజీల కారణంగా మధ్యలోనే నేలపాలవుతున్నాయి. రోజు విడిచి రోజు సరఫరా చేస్తున్న అరకొర తాగునీరు సైతం నిర్వహణ కారణంగా ప్రజలకు సక్రమంగా చేరడం లేదు.

లోపభూయిష్ఠంగా పైపులైన్ వ్యవస్థ

కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో సుమారు 22 వేల కుటుంబాలున్నాయి. జనాభా లక్షకు పైగా ఉంది. అధికారుల లెక్కల ప్రకారం సుమారు 9,800కి పైగా నల్లా కనెక్షన్లు ఉన్నాయి. ప్రజల అవసరాలు తీరేందుకు రోజుకు 9.5 ఎంఎల్‌డీ(మిలియన్ లీటర్స్ ఫర్ డే) నీరు సరఫరా చేయాల్సి ఉంది. కానీ రోజు విడిచి రోజు సరఫరా చేయడంతో కేవలం 6 నుంచి 7 ఎంఎల్‌డీలు మాత్రమే అందుతున్నాయి. ఇందులోనూ లీకేజీల ద్వారా పెద్ద ఎత్తున శుద్ధి జలాలు వృథాగా పోతున్నాయి. లీకేజీలను అరికట్టడంలో అధికారులు, సిబ్బంది విఫలమవుతున్నారు. పాత పైపులైన్ స్థానంలో కొత్తదాన్ని ఏర్పాటు చేయడానికి 2021లో రూ.130 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపించారు. అది నేటికీ కార్యరూపం దాల్చలేదు. మరోవైపు పాత లైన్ ఎక్కడపడితే అక్కడ మరమ్మతులకు గురవుతోంది.

ఎప్పుడూ తిప్పలే..

ఉభయ పట్టణాల్లో 'మిషన్ భగీరథ'లో భాగంగా నిరంతరం నీరు సరఫరా చేస్తామని నాయకులు, అధికారులు చెప్పినా అది పైపులైన్ పనుల నిర్మాణ దశకే పరిమితమైంది. కేవలం 50 శాతం పనులు పూర్తయ్యాయి. ఇంటింటికీ నల్లా కనెక్షన్ ప్రక్రియ పూర్తికాలేదు. రోజు



విడిచి రోజు సరఫరా చేస్తామని చెప్పినా.. ప్రస్తుతం వారానికి ఒకట్రెండు రోజులు మాత్రమే అందిస్తున్నారు. వర్షాకాలంలో జంట పట్టణాల్లో లీకుల కారణంగా కలుషిత జలాలు సరఫరా అయ్యే అవకాశం ఉంది. అది తాగేందుకు పనికిరాదు. పైగా నీటి జనిత వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచిఉంది. ఈ నేపథ్యంలో తాగునీటి పరంగా పురవాసులకు మరిన్ని గడ్డు పరిస్థితులు ఎదురుకానున్నాయి. సిబ్బంది సకాలంలో స్పందించి లీకేజీలకు మరమ్మతులు చేస్తేనే సమస్య పరిష్కారం అవుతుందని ప్రజలు వేడుకుంటున్నారు.

నిరంతరం పర్యవేక్షిస్తున్నాం..కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో ఏర్పడే పైప్‌లైన్ లీకేజీలపై మున్సిపల్ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఎక్కడ లీకేజీ ఏర్పడితే అక్కడ తక్షణమే మరమ్మతులు చేస్తున్నాం. సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. జి.రఘు, మున్సిపల్ కమిషనర్, కొత్తగూడెం

# పంట ఉత్పత్తుల నిల్వకు భరోసా



ఖమ్మం: రైతులు పండించిన పంట ఉత్పత్తుల నిల్వకు ప్రతి మండలంలో ఒక గోదాము అవసరమని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. తాజా నిర్ణయంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో కొన్నిచోట్ల కొత్తగా గోదాములు ఏర్పాటయ్యే అవకాశముంది. ఏటా సాగు విస్తీర్ణంతో పాటు దిగుబడులు గణనీయంగా పెరుగుతుండటంతో గోదాములకు డిమాండ్ ఏర్పడింది.

ఉభయ జిల్లాల్లో..

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో సుమారు 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుంది. ప్రస్తుత గోదాముల సామర్థ్యం 1.66 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే. అందుకే రైతులు పంట ఉత్పత్తులను రోడ్లపై, కల్లాల్లో నిల్వ చేస్తున్నారు. అకాల వర్షాలతో నష్టపోతున్నారు. ధాన్యం, మొక్కజొన్నల దిగుబడులు ఒకే సమయంలో వస్తుండటంతో నిల్వ చేసేందుకు గోదాముల్లో స్థలం సరిపోవటం లేదు. విద్యాసంస్థలు, జిన్నింగ్ మిల్లులతో పాటు పొరుగు జిల్లాలకు తరలిస్తున్నారు.

మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించనప్పుడు రైతులు తమ పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు యత్నిస్తారు. కొందరు స్థలాభావం వల్ల తక్కువ ధరకే దిగుబడులను విక్రయించి నష్టపోతుంటారు. ప్రతి మండలంలో 10వేల నుంచి 15వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాములు ఉంటే స్థానిక రైతులు తమ పంట ఉత్పత్తులను నిల్వ చేసుకోవచ్చు.

ఇక్కడ మరిన్ని అవసరం..

ఖమ్మం జిల్లాలో నాగార్జునసాగర్ ఎడమకాల్వ పరిధిలోని పాలేరు, వైరా, సత్తుపల్లి నియోజకవర్గాల్లో ఎక్కువ ధాన్యం ఉత్పత్తి అవుతోంది. ఆయా ప్రాంతాల్లో గోదాముల సంఖ్య పెంచాలని రైతులు కోరుతున్నారు.

మండలానికో గోదాము నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించటం వల్ల రైతుల కష్టాలు తీరనున్నాయి. కొత్తగా గోదాములు నిర్మిస్తే రైతులు స్థానికంగానే తమ పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునే అవకాశం దొరుకుతుంది. మార్కెట్‌లో మంచి ధర ఉన్నప్పుడు విక్రయించుకుంటారు. కె.నాగరాజు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, ఖమ్మం

ఖమ్మం జిల్లాలో... ప్రస్తుత గోదాముల సంఖ్య: 57

నిల్వ సామర్థ్యం: 1,06,770 మెట్రిక్ టన్నులు

గోదాములు లేని మండలాలు: సింగరేణి, కామేపల్లి, తిరుమలాయపాలెం, ముదిగొండ, పెనుబల్లి, కూసుమంచి

# అటు పరిహారం.. ఇటు స్వాహాకార్యం

ఖమ్మం: సింగరేణి ఉపరితల గని(ఓసీ) విస్తరణ కోసం భూములు సేకరించారు. భూనిర్వాసిత పరిహారం కూడా చెల్లించారు. కానీ ఆ భూముల సర్వేనెంబర్లు రికార్డుల నుంచి తొలగించలేదు. దీన్ని కొందరు తమకు అవకాశంగా మలచుకున్నారు. రైతు బంధు నగదు నిరాటంకంగా జమ అవుతుండగా, కొందరు ఇంకొంచెం ముందుకు వెళ్లి పంట రుణాలు పొందడానికి దరఖాస్తులు చేసినట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వ ఖజానాకు గండిపడుతోంది.

రైతు బంధు యథాతథం..ఆపై రుణ దరఖాస్తులు

సత్తుపల్లిలోని జేవీఆర్ ఓసీ విస్తరణ కోసం కొమ్మేపల్లి, రేజర్లలో వ్యవసాయ భూములు సేకరించారు. విజయవాడ డైవర్షన్ రోడ్డులోనూ కొంత సేకరించి ఆయా భూములకు సింగరేణి సంస్థ పరిహారం చెల్లించింది. తమ అవసరాల నిమిత్తం సింగరేణి పరిహారం చెల్లించి భూములను స్వాధీనం చేసుకున్న వెంటనే సదరు సర్వే నంబర్లు, భూ వివరాలు ధరణి పోర్టల్‌తోపాటు సంబంధిత రికార్డుల్లో పూర్తిస్థాయిలో తొలగించాల్సి ఉంది. కానీ ఆయా భూములకు సంబంధించి పలు సర్వే నంబర్లు రికార్డుల్లో, ఆన్‌లైన్‌లో తొలగించకపోవడంతో సదరు వ్యవసాయ భూములకు రైతు బంధు నగదు జమ అవుతోంది. కొందరు అక్రమార్కులు ఇదే అదునుగా భావించి పరిహారం అందుకున్న భూములపైనా పంట, మార్టిగేజ్ రుణాల కోసం బ్యాంకుల్లో దరఖాస్తులు సైతం చేసుకున్నారు. అడ్డదారిలో కొందరు రుణాలు పొందుతున్నారన్న చర్చ కూడా సత్తుపల్లిలో పెద్దఎత్తున జరుగుతోంది.

ఆది నుంచీ అక్రమాలే..

జేవీఆర్ ఓసీ పరిహారాల అంశంపై ఆది నుంచీ ఆరోపణలున్నాయి. కొమ్మేపల్లిలో కొందరు రూ.కోట్లల్లోనే పరిహారాన్ని కాజేశారనే ప్రచారం అప్పట్లో పెద్దఎత్తున జరగ్గా రేజర్లలోనూ సింగరేణి పరిహారంలో అనేక అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వినిపించాయి. 2022 జనవరిలో రేజర్ల భూములకు పరిహారం చెల్లించినా సర్వే నంబర్లు తొలగించకపోవడంతో నాటి నుంచి నాలుగు దఫాల్లో రూ.లక్షల్లోనే రైతు బంధు నగదు జమ అయింది. రైతు బంధుతోపాటు ఒకవేళ పంట రుణాలు ఇచ్చినట్లయితే ఆయా సొమ్మును బ్యాంకర్లు తిరిగి



ఎలా వసూలు చేస్తారనేది సందేహంగా మారింది. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు, సింగరేణి సంస్థ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

రికార్డుల్లోంచి తొలగిస్తాం.. సూర్యనారాయణ, ఆర్డీవో

ఆయా సర్వే నంబర్లు ఈ నెల 15లోగా రికార్డుల్లో నుంచి తొలగిపోతాయి. విజయవాడ రోడ్డు డైవర్షన్‌లో కొన్ని సర్వే నంబర్లకు సంబంధించి పరిహారం అందనివి కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో పరిహారం ఇచ్చిన కొన్ని భూముల సర్వే నంబర్లు తొలగించాం. రేజర్లలో ఒక బిట్టులో మొత్తం 415 ఎకరాల్లో 350 ఎకరాలు సింగరేణి విస్తరణలో కలుస్తుండగా మిగిలింది రోడ్డు డైవర్షన్‌లో ఉంది. కోర్టు కేసుల్లో కొన్ని సర్వే నంబర్లు ఉండటం వల్ల తొలగించలేదు. తొలగించాల్సిన సర్వే నంబర్ల జాబితాను ఇటీవలే ఉన్నతాధికారులకు పంపాం. బ్యాంకులకు కూడా ఆయా సర్వే నంబర్లకు రుణాలు ఇవ్వొద్దని లేఖలు పంపుతాం. సింగరేణి నుంచి కూడా లేఖలు పంపేలా చర్యలు తీసుకుంటాం.

# మార్కెట్ల ఆదాయ లక్ష్యం రూ.52.27 కోట్లు

మహబూబాబాద్ :జిల్లా పరిధిలోని నాలుగు వ్యవసాయ మార్కెట్ కమిటీల ఆదాయ లక్ష్యాన్ని మార్కెటింగ్ శాఖ ఖరారు చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.52.27 కోట్లు ఆదాయం సమకూర్చుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు వరంగల్ ఎనుమాముల మార్కెట్‌కు రూ.42 కోట్లు, నర్సంపేటకు రూ.6.62 కోట్లు, నెక్కొండకు రూ.1.40 కోట్లు, వర్ధన్నపేట మార్కెట్కు రూ.2.25 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటల దిగుబడిపై ప్రభావం పడే అవకాశముందని వ్యవసాయ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు. ఈ వానాకాలం సీజన్‌లో జిల్లాలో 1.35 లక్షల ఎకరాల్లో వరి, 1.30 లక్షల ఎకరాల్లో పత్తి, 3 వేల ఎకరాల్లో వేరుశనగ, 13 వేల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగవుతుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు మిర్చి సీజన్ కారణంగా సెస్సుల రూపంలో ఎనుమాముల మార్కెట్‌కు రూ.15.83 కోట్ల ఆదాయం వచ్చింది. వర్షాకాలం, యాసంగి సీజన్లలో మార్కెట్‌కు వచ్చే పంట ఉత్పత్తుల ద్వారా మిగిలిన లక్ష్యం సాధించడానికి మార్కెట్ అధికారులు సమాయత్తం అవుతున్నారు.

స్వల్పంగా లక్ష్యం కుదింపు

ఎనుమాముల మార్కెట్ మినహా మిగతా మూడు మార్కెట్లకు గతేడాదితో పోలిస్తే ఈసారి ఆదాయ లక్ష్యం స్వల్పంగా కుదించారు. నాలుగు మార్కెట్లకు గతేడాది రూ.54 కోట్ల లక్ష్యం నిర్దేశించగా.. ఈ ఏడాది రూ.52.27 కోట్లు మాత్రమే విధించారు. గతేడాది ఎనుమాముల మార్కెట్‌కు విధించిన లక్ష్యంలో రూ.4.9 కోట్ల ఆదాయం తక్కువ వచ్చింది. అయినా గతేడాది కన్నా రూ.2 కోట్లు అదనంగా లక్ష్యాన్ని నిర్దేశించారు. పత్తి, మిర్చి సీజన్‌లలో వ్యాపారుల జీరో దందా కారణంగా మార్కెట్ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లకు సంబంధించిన ధాన్యం కొనుగోలు బకాయిలను ఎనుమాముల మార్కెట్‌కు రూ.6.41 కోట్లు, నర్సంపేటకు రూ.2.76 కోట్లు, వర్ధన్నపేటకు రూ.1.23 కోట్లు, నెక్కొండకు రూ.76.72 లక్షలు చెల్లించడంతోనే ఆ మేరకు ఆదాయం సమకూరింది.

వందశాతం సాధనకు కృషి..- పాలకుర్తి ప్రసాద్‌రావు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిరాష్ట్ర మార్కెటింగ్‌శాఖ జిల్లాలోని నాలుగు మార్కెట్లకు నిర్దేశించిన లక్ష్యాలను వందశాతం చేరుకునేలా కృషి చేస్తాం. అందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటాం. గత ఏప్రిల్ నుంచి జూన్ వరకు 32.88 శాతం ఆదాయం మార్కెట్లకు సమకూరింది.




చింతలపూడి: వైకాపా పాలనలో ఏ వర్గమూ సంతోషంగా లేదని తెదేపా అధినేత చంద్రబాబు అన్నారు. సీఎం జగన్‌ను భరించే స్థితిలో రాష్ట్ర ప్రజలు లేరని.. వైకాపాను సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఏలూరు జిల్లా చింతలపూడిలో నిర్వహించిన 'రా.. కదలిరా..' బహిరంగ సభలో ప్రసంగించిన ఆయన.. సీఎం జగన్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. వైకాపా పాలన తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "వైకాపా అధికారంలోకి వచ్చాక రూ.లక్ష కోట్లు దోపిడీ జరిగింది. సీఎం జగన్ రూ.12 లక్షల కోట్లు అప్పులు చేశారు. అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారు. జగన్ అర్జునుడు కాదు.. అక్రమార్జనుడు. దేశ రాజకీయాల్లో ఇంత అక్రమంగా ఆర్జించే వారిని నేను చూడలేదు. రాష్ట్ర ప్రజలకు డబ్బులు కాదు.. దెబ్బల మీద దెబ్బలు ఇచ్చారు. మద్యం దోపిడీతో ఈ జగన్ జలగ.. జనం రక్తం తాగుతోంది. విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజల నడ్డి విరిచారు. రూ.64 వేల కోట్ల మేర విద్యుత్ ఛార్జీలు పెంచారు. ఆయన మళ్లీ జైలుకు వెళ్తే ఆ అప్పులన్నీ ప్రజలే కట్టాల్సి వస్తుంది. ఒక్క ఛాన్స్ అని చెప్పి ప్రజలను గోదావరిలో ముంచేశారు. వైకాపా పాలనలో ప్రజల సంపదంతా ఆవిరైంది.. అప్పుల పాలయ్యే పరిస్థితి వచ్చింది. తెదేపా హయాంలో పోలవరం ప్రాజెక్టు పనులు 72 శాతం పూర్తయ్యాయి. పట్టిసీమ ప్రాజెక్టు పనులు ఏడాదిలో పూర్తి చేశాం. ఈ ప్రాజెక్టు ద్వారా 120 టీఎంసీల నీటిని కృష్ణా డెల్టాకు ఇచ్చాం. పోలవరం ద్వారా నదులు అనుసంధానించి ప్రతి ఎకరాకూ నీళ్లిస్తాం. కేంద్రం సాయం తీసుకొని పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తాం. చింతలపూడి ప్రాజెక్టును పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరిస్తాం. ఆక్వా, పామాయిల్ రైతులకు ప్రోత్సాహకాలు అందించి ఆదుకుంటాం. యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనేదే నా ఆకాంక్ష. ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. నిరుద్యోగులకు భృతి అందజేసి ఆదుకుంటాం. యువతను ప్రపంచంతో అనుసంధానం చేసే బాధ్యత నేను తీసుకుంటా. నేను ప్రజలతోనే ఉంటా.. ప్రజల కోసమే పోరాడుతా.. రాష్ట్రంలో మళ్లీ వెలుగులు నింపే శక్తి మనకే ఉంది. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బటన్ నొక్కి జగన్‌ను ఇంటికి పంపాలి. తెదేపా-జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావాలి" అని చంద్రబాబు అన్నారు.




వాషింగ్టన్: అమెరికాలో హెచ్-4 వీసా కలిగిన వారికి ఊరటనిచ్చే కీలక బిల్లును త్వరలో సెనెట్ ఆమోదించనుంది. దీంతో సుమారు లక్ష మందికి లబ్ధి చేకూరనుంది. ఆదివారం అమెరికన్ సెనెట్‌లో రిపబ్లికన్‌లు, డెమోక్రాట్‌ల మధ్య జరిగిన సుదీర్ఘ చర్చల్లో 'జాతీయ భద్రతా ఒప్పందానికి' ఆమోదం తెలిపేందుకు ఇరు వర్గాలు అంగీకరించాయి. హెచ్-1బీ వీసాదారుల జీవిత భాగస్వాములు, 21 ఏళ్లలోపు వయసున్న వారి పిల్లలు ఉద్యోగం చేసుకోవడానికి వీలుగా హెచ్-4 వీసాలు జారీ చేస్తుంటారు. హెచ్-4 వీసాదారులు అమెరికాలో ఉద్యోగం చేయాలంటే తప్పనిసరిగా ఎంప్లాయిమెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్, ఐ-765 కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ దరఖాస్తు ప్రక్రియ పూర్తయి ఆథరైజేషన్ వస్తేనే వారు ఉద్యోగం చేసేందుకు అవకాశం లభిస్తుంది. అయితే ఇది పూర్తవడానికి ఏడాది సమయం పడుతుంది. దీనివల్ల హెచ్-4 వీసాదారులు ఉద్యోగావకాశాలు కోల్పోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతమున్న నిబంధనలు మార్చి హెచ్-4 వీసాదారులకు 'ఆటోమేటిక్‌గా వర్క్ ఆథరైజేషన్' కల్పించేలా రూపొందించిన బిల్లుకు ఆమోదం తెలపనున్నట్లు వైట్‌హౌస్ ఒక ప్రకటనలో తెలిపింది. "కొత్తగా తీసుకొస్తున్న బిల్లు మన దేశాన్ని బలోపేతం చేయడంతోపాటు సరిహద్దులను సురక్షితం చేస్తుంది. చట్టబద్ధంగా వలసలకు అవకాశం కల్పిస్తుంది" అని బైడెన్ తెలిపారు. "ఈ విధానం కింద ఏటా 18 వేల మందికి ఉపాధి ఆధారిత గ్రీన్ కార్డులను జారీ చేస్తారు. ఐదేళ్లలో సుమారు 1,58,000 మందికి లబ్ధి కలుగుతుంది. అలాగే, ఏడాదికి 25,000 మంది %ఖ-1, ఖ-2, ఖ%-3 వలసేతర వీసా (పర్యటకం, వైద్యం, వ్యాపారం వంటి తాత్కాలిక పనుల నిమిత్తం జారీ చేస్తారు) ఉన్నవారితోపాటు, లక్ష మంది హెచ్-4 వీసాదారులకు తమ జీవిత భాగస్వామి పనిచేసే ప్రాంతంలో ఉద్యోగం చేసే అవకాశం లభిస్తుంది" అని వైట్‌హౌస్ వెల్లడించింది. హెచ్-4 వీసా కలిగిన వారు ఉద్యోగాలు చేసుకొనే అవకాశాన్ని కల్పిస్తూ.. 2015లో ఒబామా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో శాస్త్ర సాంకేతిక (%ూజువీ%) రంగాల్లో నైపుణ్యం కలిగి ఉద్యోగం కోసం అమెరికా వెళ్లిన వారికి ఆర్థికంగా కొంత ఊరట లభించింది. ఈ వీసాలు పొందిన వారిలో ఎక్కువగా భారతీయ మహిళలే ఉన్నారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత వీటిపై ఆంక్షలు విధించారు. దీంతో వివిధ రంగాల్లో నిపుణులైన భారతీయులు ఉద్యోగావకాశాలు కోల్పోయారు. ఇప్పుడు ఈ ఆంక్షలు ఎత్తివేసేందుకు బైడెన్ ప్రభుత్వం సిద్ధమవుతోంది.




అమరావతి: తెదేపా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణలో భాగంగా ఏపీ హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. అరెస్టు చేస్తారని ఎంపీ, ఎమ్మెల్యేలే భయపడుతుంటే సామాన్యుల సంగతేంటని ప్రశ్నించింది. "ఏడేళ్లలోపు జైలు శిక్షకు వీలున్న కేసుల్లో సెక్షన్ 41ఏ నోటీసు ఇవ్వాలి. అలా వివరణ తీసుకోకుండా అరెస్టుకు ఎలా ప్రయత్నిస్తారు? అలా చేస్తే బాధ్యులు పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. సంబంధిత పోలీసు అధికారి అరెస్టుకు ఆదేశాలు ఇస్తాం. ఎవరో ఒక ఉన్నతాధికారిపై చర్యలకు ఆదేశిస్తే తప్ప పరిస్థితి చక్కబడేట్లు లేదు" అని హైకోర్టు వ్యాఖ్యానించింది. దీనిపై వివరాల సమర్పణకు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమయం కోరారు. అనంతరం తదుపరి విచారణను ఉన్నత న్యాయస్థానం మంగళవారానికి వాయిదా వేసింది.

## గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకున్న టీడీపీ ఎమ్మెల్యేలు.. ఏ అంశంపై అంటే?



అమరావతి, ఫిబ్రవరి 5: ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మొదలయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తున్నారు. అయితే గవర్నర్ ప్రసంగంలో చెప్పిన ఓ అంశంపై టీడీపీ ఎమ్మెల్యేలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. దీంతో సభలో కాసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. జగనన్న విద్యా దీవెన క్రింద పూర్తి రీయింబర్స్‌మెంట్ ఇచ్చామని గవర్నర్ చెబుతుండగా టీడీపీ సభ్యులు అభ్యంతరం తెలిపారు. గవర్నర్ ప్రసంగం జరుగుతుండగానే టీడీపీ సభ్యులు నినాదాలు చేశారు. పూర్తి రీయింబర్స్‌మెంట్ అంతా అబద్ధమంటూ తెలుగుదేశం సభ్యులు నిరసన తెలిపారు. 17 ప్రభుత్వ ఆసుపత్రులు కొత్తగా పెట్టామని చెబుతుండగా కూడా టీడీపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మెగా డీఎస్సీ కాదు... దగా డీఎస్సీ అంటూ ప్రతిపక్షాలు నినాదాలు చేశారు. నాడు నేడు కాదు అంతా అధ్వాన్నమే అంటూ టీడీపీ సభ్యులు నిరసన తెలిపడంతో సభలో కొద్దిసేపు గందరగోళన పరిస్థితి నెలకొంది. అయితే వెంటనే గవర్నర్ కల్పించుకుని "నాకు థ్రోట్ ఇరిటేషన్ ఉంది" అని చెప్పడంతో టీడీపీ సభ్యులు వెనక్కి తగ్గారు.

**గవర్నర్ ప్రసంగంలోని అంశాలు...** విజయవడలో 18.8 ఎకరాల్లో 206 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని రూ. 404.35 కోట్లతో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ విగ్రహం ఏర్పాటు పట్ల సీఎం జగన్, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు. విజయవాడలో ప్రపంచంలో ఎత్తైన అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ జరిగిందన్నారు. అల్పాదాయ వర్గాలకు ఆర్థిక లబ్ధి చేకూర్చే నవరత్నాలు కార్యక్రమం అమలు చేశామన్నారు. విద్యార్థిని, విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో టాబ్‌లు ఇచ్చామన్నారు. విద్యార్థులను గ్లోబల్ సిటిజన్స్‌గా మార్చే కృషి జరుగుతుందన్నారు. ఇంగ్లీష్ మీడియం వలన విద్యార్థులు అంతర్జాతీయంగా పోటీ పడే పరిస్థితి తెచ్చామని గవర్నర్ వెల్లడించారు.




## విశ్వాస తీర్మానం గెలుపు.. 47 మంది ఎమ్మెల్యేలు అనుకూలం, 29 ప్రతికూలం

రాంచీ: జారాఁఖండ్ ముఖ్యమంత్రి చంపయి సోరెన్ రాష్ట్ర అసెంబ్లీలో శనివారంనాడు ప్రవేశపెట్టిన 'విశ్వాస తీర్మానం' గెలిచింది. సభలో ప్రవేశపెట్టిన విశ్వాస తీర్మానానికి అనుకూలంగా 47, వ్యతిరేకంగా 29 ఓట్లు పడ్డాయి. దీంతో జారాండ్ సర్కార్ మనుగడకు అడ్డంకులు తొలగిపోయాయి. దీనికి ముందు ముఖ్యమంత్రి చంపయి సోరెన్ రాష్ట్ర అసెంబ్లీలో విశ్వాసతీర్మానాన్ని ప్రవేశపెట్టారు. భూకుంభకోణం కేసులో ఈడీ అరెస్టు చేసిన మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ప్రభుత్వ విశ్వాస పరీక్షకు హాజరయ్యారు. 81 మంది సభ్యుల రాష్ట్ర అసెంబ్లీలో విశ్వాస తీర్మానంపై చర్చను ముఖ్యమంత్రి ప్రారంభిస్తూ, దర్యాప్తు సంస్థలను కేంద్రం దుర్వినియోగం చేస్తోందని అన్నారు. 'కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోంది. 2019లో హేమంత్ సోరెన్‌కు ప్రజాతీర్పు లభించింది. అలాంటి ముఖ్యమంత్రిని భూకుంభకోణం కేసులో అరెస్టు చేశారు" అని చంపయి సోరెన్ ఆవేదన వ్యక్తం చేశారు. జారాండ్ చరిత్రలో గిరిజనులు ఎప్పుడు తమ సామర్థ్యాన్ని పెంచుకోవాలని చూసినా ఆ నాయకత్వాన్ని అణిచివేసే ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయని ఉన్నారు. హేమంత్ సోరెన్ విషయంలో ఎలాంటి అన్యాయం జరిగిందో ఈరోజు యావద్దేశ ప్రజలు చూశారని, మీరు ఏ గ్రామానికి వెళ్లి చూసినా ప్రతి ఇంట్లోనూ హేమంత్ సోరెన్ ప్రవేశపెట్టిన పథకాలు కనిపిస్తాయని సీఎం చెప్పారు.

**సోరెన్ జిందాబాద్ నినాదాలు :** దీనికి ముందు, అసెంబ్లీని ఉద్దేశించి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ప్రసంగిస్తుండగా, అధికార పార్టీ ఎమ్మెల్యేలు "హేమంత్ సోరెన్ జిందాబాద్" అంటూ నినాదాలు చేశారు. అధికార పార్టీ ఎమ్మెల్యేల ప్రవర్తనపై గవర్నర్ సభ వెలుపల మాట్లాడుతూ, గవర్నర్ ప్రసంగాన్ని అధికార పార్టీనే సిద్ధం చేసిందని, ఇప్పుడు వారే నినాదాలు చేస్తున్నారని ఆక్షేపించారు. కాగా, తమకు 47 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని, విశ్వాస పరీక్షలో గెలిచి తీరుతామని జేఎంఎం ప్రధాన కార్యదర్శి సుప్రియో భట్టాచార్య మీడియాకు తెలిపారు.

## మూడు రాజధానుల బిల్లు.. పార్టీకి తీవ్ర నష్టమని చెప్పా: వైకాపా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్



ఐతవరం: "గత ఎన్నికలకు ముందు జగన్‌ను కలిసి రాజధానిపై స్పష్టత అడిగితే.. నేను ఇల్లు కూడా కట్టుకున్నా కదా.. అమరావతిలోనే ఉంటుంది" అని చెప్పారని వైకాపాకు చెందిన మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తెలిపారు. ఎన్నికల తర్వాత ఆయన మాట మార్చారన్నారు. మైలవరంలో అనుచరులతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో అభివృద్ధికి ఏమీ చేయలేకపోవడంతో తనలో అంతర్మథనం మొదలైందని చెప్పారు. పార్టీలో అవమానాలు ఎదురవుతున్నా ఏడాదిగా సహించానన్నారు.

"మూడు రాజధానుల బిల్లు పెట్టిన రోజే పార్టీ మీటింగ్ పెట్టారు. బిల్లును సమర్థించాలని చెప్పారు. దీనిపై పార్టీకి తీవ్రంగా నష్టం జరుగుతుందని చెప్పా.

తప్పనిసరైతే సెక్రటేరియట్ అయినా ఇక్కడే ఉంచాలని కోరా. నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం ఎన్నోసార్లు అడిగా. నేను ఎన్ని ప్రతిపాదనలు ఇచ్చినా బుట్టదాఖలు చేశారు. ఎమ్మెల్యేగా సీఎం నుంచి ఒక్క రూపాయి సాధించలేకపోయా. నేను అడిగితే గతంలో నందిగామ కోసం వైఎస్ఆర్ రూ.100 కోట్ల నిధులిచ్చారు. జగన్ హయాంలో రూ.కోటి కూడా తెచ్చుకోలేకపోయా. పనులు చేసిన వైకాపా కార్యకర్తలకు బిల్లులు రాలేదు. ప్రభుత్వానికి కార్యకర్తలు పెట్టుబడి పెట్టాలా? కక్ష సాధింపు చర్యలతో ఏమీ సాధించలేరు. అధికారం ఉందని అహంకారం ప్రదర్శించకూడదు. చంద్రబాబును తిడితే పదవులు ఇస్తామంటే ఎలా అని ప్రశ్నించా. మనసు గాయపడ్డాక నిలువెత్తు బంగారం ఇస్తానన్నా వెనక్కి వెళ్లను. కొత్త ఇన్‌ఛార్జిని నియమించాక రాజకీయాలకు స్వస్తి పలుకుదామనుకున్నా. రాజకీయాల నుంచి వెళ్లొద్దని నా అనుచరులు, అభిమానులు చెప్పారు. వారితో మాట్లాడి త్వరలో నిర్ణయం తీసుకుంటా. ఎవరెన్ని ఆరోపణలు చేసినా నేను భయపడను" అని వసంత కృష్ణప్రసాద్ అన్నారు.




## వైసీపీ అభ్యర్థి ఉమాబాలపై రఘురామ ఇంట్రెస్టింగ్ కామెంట్స్

న్యూఢిల్లీ: నరసాపురం వైసీపీ ఎంపీ అభ్యర్థిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన గూడూరి ఉమాబాలను ఎట్టకేలకు అధిష్టానం బరిలోకి దింపుతోంది. అయితే.. టీడీపీ-జనసేన మిత్రపక్షంలో భాగంగా నరసాపురం నుంచి దాదాపు వైసీపీ రెబల్ ఎంపీ రఘురామకృష్ణంరాజు ఫిక్స్ అయ్యారు. ఉమాబాలను అభ్యర్థిగా ప్రకటించాక మొదటిసారిగా రఘురామ స్పందించారు.

**జగన్‌కు మాత్రమే..!** 'నాపై పోటీకి రోజుకొక అభ్యర్థి పేరు చెబుతున్నారు. వైసీపీ నాయకురాలు ఉమాబాలను నాపై పోటీకి నిలబెడతామని అంటున్నారు. ఆమెతో నాకు ఎలాంటి శత్రుత్వం లేదు. నేను సీఎం జగన్మోహన్ రెడ్డికి మాత్రమే శత్రువును' అని రఘురామ అన్నారు.

**నేర్చుకో జగన్..!** సోమవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్ తన సొంత చెల్లెలను, తల్లిని ముందు తిట్టించడం మానేయాలని సూచించారు. అలాగే కుటుంబ సభ్యులకు మర్యాద ఇవ్వడం నేర్చుకోవాలన్నారు. దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపది ముర్మును.. ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రపతిని చేశారన్నారు. దీనికి ఏదో మహిళ.. పక్షపాత మహిళ అభ్యుదయ కోసం చేశారని జగన్ అనడం ఏంటని ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డి పూలే, కందుకూరి వీరేశలింగం లా ఫీల్ అవ్వొద్దని రఘురామకృష్ణంరాజు సూచించారు.

**గేట్లే లేవు.. ప్రాజెక్టులా..?** అన్నమయ్య డ్యామ్స్ గేట్స్ కట్టని వ్యక్తి.. పోలవరం ప్రాజెక్టు ఎలా కడతారని సీఎం జగన్‌ను ఉద్దేశించి రఘురామ వ్యాఖ్యలు చేశారు. 2023 లో పోలవరం పూర్తి చేస్తామని జగన్, ఆయన మంత్రులు అన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. 2024 వచ్చింది.. పోలవరం పూర్తి చేస్తామని ఇప్పుడు కూడా చెబుతున్నారని.. అవినీతికి తావులేకుండా చేస్తామంటుంటే ఇలాంటి నటుడిని చూడలేదని రఘురామ వ్యాఖ్యానించారు.

## మే నాటికి పూర్తిగా భారత్ బలగాల ఉపసంహరణ: పార్లమెంట్‌లో మాల్దీవుల అధ్యక్షుడు



మాలె: దౌత్యపరమైన ఉద్రిక్తతల వేళ.. మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు తన భారత వ్యతిరేక వైఖరిపై ఏ మాత్రం వెనక్కితగ్గడం లేదు. తమ దేశంలో ఉన్న భారత్ బలగాల ఉపసంహరణ మే 10నాటికి పూర్తవుతుందని వెల్లడించారు. ఈ ఏడాదిలో ఆయన పార్లమెంట్‌లో తొలి ప్రసంగం చేస్తూ.. 'మా సార్వభౌమత్వం విషయంలో మరొక దేశం జోక్యాన్ని మేం అనుమతించం' అని స్పష్టం చేశారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. తమ దేశంలో ఉన్న మూడు వైమానిక స్థావరాల్లో ఒకదానిలో విధులు నిర్వర్తిస్తోన్న బలగాలు మార్చి 10లోగా వెళ్లిపోతాయని, మిగతా రెండు స్థావరాల్లో ఉన్న దళాలు మే 10 నాటికి వైదొలుగుతాయని ముయిజ్జు తెలిపారు. ఈ విషయంలో భారత్‌తో ఉన్న ఒప్పందాన్ని పునరుద్ధరించుకోవడం లేదని చెప్పారు. ఈ బలగాల ఉపసంహరణపై రెండు దేశాలు ఒక అంగీకారానికి వచ్చినట్లు ఇప్పటికే అంతర్జాతీయ కథనాలు వెల్లడించాయి. మాల్దీవుల్లో మోహరించిన భారత బలగాలు.. భారత్ సహకారంతో ఏర్పాటు చేసిన రాడార్ స్టేషన్లు, నిఘా విమానాల నిర్వహణ బాధ్యతలను చూస్తుంటాయి. భారత యుద్ధ నౌకలు మాల్దీవుల ప్రత్యేక ఆర్థిక జోన్‌లో గస్తీకి సహకరిస్తాయి. భారత పశ్చిమ తీరానికి సమీపంలో ఉన్న లక్షదీవులకు కింద ఈ మాల్దీవులు ఉన్నాయి. మధ్య ఆసియా నుంచి తూర్పు ఆసియాకు వెళ్లే కీలకమైన సముద్రమార్గం ఇక్కడకు సమీపంలోనే ఉంది. మాల్దీవులు చిన్న దేశం కావడంతో భారత్ ఎక్కువగా సాయం చేసింది. మాల్దీవుల్లో చైనా తిష్టవేయడం భారత భద్రతపై తీవ్ర ప్రభావం చూపించే ప్రమాదముందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## మళ్లీ సారీ చెప్పిన ధన్య.. ఇదేమైనా పబ్లిసిటీ స్టంటా?

నటి ధన్య బాలకృష్ణ 'లాల్ సలామ్' సినిమాతో మరోసారి అభిమానుల్ని పలకరించనుంది. ఐశ్వర్య రజనీకాంత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఫిబ్రవరి 9న థియేటర్లలోకి రానుంది. అయితే సినిమా విడుదలకు కొన్ని రోజుల ముందు, ధన్య బాలకృష్ణ పాత వివాదం ఇకటి సోషల్ మీడియాలో మళ్లీ వైరల్ అవుతోంది. ఇది నెటిజనుల్లో డిబేట్ గా మారింది. ధన్య బాలకృష్ణ పాత కామెంట్లు ఇప్పుడు కొత్తగా చిక్కులు తెచ్చి పెడుతున్నాయి. తమిళ ప్రజల గురించి అప్పట్లో ధన్య తీవ్ర ఆరోపణలు చేసారు. ఇప్పుడు తన సినిమా విడుదలకు ముందు ధన్య పాత వ్యాఖ్యలను ఖండిస్తూ తప్పునకు చింతిస్తున్నట్లు తెలిపింది. రజనీకాంత్, ఐశ్వర్య అభిమానులకు క్షమాపణలు తెలియజేస్తూ ఒక ప్రకటన విడుదల చేసింది. ఇంతకీ వివాదం ఏమిటీ? అంటే... 2012లో చెన్నై సూపర్ కింగ్స్ %ఖూూ% (ఇండియన్ ప్రీమియర్ లీగ్)కి అర్హత సాధించిన తరువా ధన్య ఫేస్‌బుక్ పోస్ట్‌లో తమిళ ప్రజల గురించి అవమానకరమైన వ్యాఖ్యలు చేసింది. ఈ పోస్ట్‌లో, చెన్నైకి చెందిన ప్రజలు నీరు విద్యుత్ కోసం బెంగళూరుపై ఆధారపడుతున్నారని ఆరోపించింది. పర్యటనల సమయంలో వారు



నగరంలో చెత్తను వేస్తున్నారని విమర్శించారు. ఇప్పుడు లాల్ సలామ్ విడుదలకు ముందు ఈ వ్యాఖ్య మళ్లీ తెరపైకి వచ్చింది. ఇంతకుముందు సారీ చెప్పిన ధన్య ఇప్పుడు మాట మార్చింది. ఈ పోస్ట్ కల్పితమని పేర్కొంది. ధన్య ప్రకటన ధృవీకరిస్తూ, "నా టేబుల్‌పై భోజనం పెట్టే నా వృత్తిపై నేను ప్రమాణం చేస్తున్నాను.. ఇప్పుడు చలామణిలో ఉన్న ప్రకటన నేను చేసినది కాదు.. అది నా అభిప్రాయం కాదు. ఇది జరిగిన 12 సంవత్సరాల క్రితమే నేను స్పష్టం చేశాను.. ఈ రోజు కూడా చెబుతున్నాను. ఇది ఒక ట్రోలర్ సృష్టించిన స్క్రీన్ షాట్. కానీ అది నేను కాదని మీకు నిరూపించడానికి నా దగ్గర ఆధారాలేవీ లేవు" అని అన్నారు. తాను, తన కుటుంబం చాలా బెదిరింపులు, ద్వేషాన్ని ఎదుర్కొన్నామని, వారిని రక్షించేందుకు అప్పట్లో ప్రయత్నించానని, అందువల్లనే తప్పు చేయకపోయినా సారీ చెప్పానని పేర్కొంది. రజనీకాంత్, ఐశ్వర్య రజనీకాంత్ అభిమానులకు ఏదైనా అసౌకర్యం, బాధ కలిగించినందుకు క్షమాపణలు చెప్పానని అంది. అయితే పాత వివాధాన్ని కొత్తగా తెరపైకి తెచ్చి క్షమాపణలు కోరడమేం టి? ఇదేమైనా పబ్లిసిటీ స్టంటా? అంటూ అభిమానుల్లో ఒక సెక్షన్ విశ్లేషిస్తోంది. లాల్ సలామ్ ఒక స్పోర్ట్స్ డ్రామా.. ఇందులో విష్ణు, విక్రాంత్ ప్రధాన పాత్రలు పోషించారు. రజనీకాంత్ అతిధి పాత్రలో ఎక్కువసేపు కనిపిస్తారు. ఇటీవలే చెన్నైలో జరిగిన ఈ సినిమా ఆడియో వేడుకకు ధన్య బాలకృష్ణ కూడా హాజరయ్యారు. ఈవెంట్ సందర్భంగా ఐశ్వర్య సినిమా సెన్సిటివ్ అంశాలతో తెరకెక్కిందని తెలిపింది. తన తండ్రి వంటి లోతైన మానవత్వం ఉన్న వ్యక్తి మాత్రమే అలాంటి ప్రాజెక్ట్‌లో భాగం కావడానికి అంగీకరిస్తారని తెలిపింది. లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఫిబ్రవరి 9న థియేటర్లలోకి రానుంది.

## లీకులపై రష్మిక మందన్న అసహనం!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో భారీ అంచనాల మధ్య 'పుష్ప-2- చిత్రీకరణ శర వేగంగా జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఎట్టి పరిస్థితుల్లో ఆగస్టు 15 కి చిత్రాన్ని ప్రేక్షకుల ముందకు తీసుకొచ్చేలా చకచకా షూటింగ్ పూర్తి చేసే పనిలో పడ్డారు. ప్రస్తుతం 'పుష్ప 2- షూటింగ్ హైదరాబాద్ రామోజీ ఫిలింసిటీలో జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా షూట్ నుంచి ఓ ఫోటో లీక్ అయిన సంగతి తెలిసిందే. అల్లు అర్జున్ చీర కట్టుకొని కూర్చున్న ఫోటో ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. తిరుపతి గంగమ్మ జాతర సన్నివేశాలతో పుష్ప 2 సినిమాలో కొన్ని సీన్స్ ముడిపడి ఉ న్నాయి. ఇప్పటికే ఆ జాతరకు రెడీ అయ్యేలాగా గతంలోనే అల్లు అర్జున్ చీర కట్టి అమ్మవారిలా ముస్తాబైన పోస్టర్ ని రిలీజ్ చేశారు. తాజాగా లీక్ అయిన ఫొటోలో అల్లు అర్జున్ అదే గెటప్ లో రెడీ అవుతున్నట్టు ఉంది. దీంతో పుష్ప 2 ఆన్ సెట్స్ లీక్ అందర్నీ గందరగోళానికి గురి చేస్తుంది. ఫోటోలు ఎలా లీక్ అవుతున్నాయో



తెలియక యూనిట్ తల పట్టుకుంటుంది.

రిలీజ్ కి ముందు ఈ లీకుల బెడద ఏంటి? అని ఆందోళన చెందుతుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ అంశంపై రష్మిక మందన్న అసహనం వ్యక్తం చేసింది. 'షూటింగ్ సెట్స్ నుంచి నటీనటుల చిత్రాల్ని లీక్ చేయడం ఆమోదయోగ్యం కాదు. ఈసినిమా కోసం ఎంతో మంది ఉత్సాహంతో ఎదురు చూస్తున్నారు.

అలా అని చెప్పి లీకైన ఫోటోలు షేర్ చేయకూడదు. సినిమాకి సంబంధించిన ఫోటోలు ముందే చూస్తే ఆసక్తి ఉండదు. సరైన సమయంలో సినిమా థియేటర్లలో రిలీజ్ అవుతుంది. థియేటర్లో వంద శాతం వినోదాన్ని పంచడం కోసం టీమ్ అంతా ఎంతో శ్రమిస్తుంది. దయచేసి సినిమా ప్రైవసీకి ఎవరూ భంగం కలిగించొద్దు. పుష్ప-2 ఉన్న ఆసక్తిని నేను అర్దం చేసుకోగలను అని తెలిపింది.





## ఫ్యామిలీ స్టార్.. మొత్తానికి ఆ డేట్ దొరికేసింది




విజయ్ దేవరకొండ పరుశురామ్ కాంబినేషన్లో రాబోతున్న రెండవ సినిమా ఫ్యామిలీ స్టార్ పై అంచనాలు ఏ స్థాయిలో ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వీరి కలయికలో వచ్చిన మొదటి సినిమా గీతగోవిందం బాక్సాఫీస్ వద్ద మంచి లాభాలను అందించింది. ఇక మళ్ళీ ఇంతకాలం తర్వాత దిల్ రాజు ప్రొడక్షన్లో వీరు చేస్తున్న ఫ్యామిలీ స్టార్ సినిమాపై పాజిటివ్ బజ్ అయితే కనిపిస్తోంది. అసలైతే ఈ సినిమాను ఈ ఏడాది సంక్రాంతికి విడుదల చేయాలని అనుకున్నారు. కానీ అప్పుడు పోటీ తీవ్రత ఎక్కువగా ఉండడం అలాగే షూటింగ్ కూడా చాలా వరకు బ్యాలెన్స్ ఉండడంతో వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. ఇక సినిమాను మార్చిలో కూడా విడుదల చేయాలని అనుకున్నారు. కానీ ఇప్పుడు ఆ ప్లాన్ మార్చుకున్నట్లుగా తెలుస్తోంది. ఏప్రిల్ లోనే దేవర మొదట అనుకున్న డేట్ ను ఫ్యామిలీ స్టార్ టార్గెట్ చేసింది. ఇటీవల దిల్ రాజు మాటలతో ఆ డేట్ కు వస్తుందని అర్థమయిపోయింది. దేవర సినిమా ఏప్రిల్ 5వ తేదీన రావాలని అనుకుంది. కానీ ఆ సినిమా షూటింగ్ ఆలస్యం అవుతూ ఉండటంతో డేట్ మార్చుకునే పనిలో పడింది. ఇక దేవర ఉండదు కాబట్టి ఏప్రిల్ 5 పర్ఫెక్ట్ డేట్ అని దిల్ రాజు ఫ్యామిలీ స్టార్ సినిమాను అప్పుడే ప్రేక్షకులు ముందుకు తీసుకురావాలి అని ఫిక్స్ అయ్యాడు. నిన్న మొన్నటి వరకు అఫీషియల్ గా క్లారిటీ ఇవ్వలేదు కానీ ఇప్పుడు మాత్రం ఒక ప్రత్యేకమైన పోస్టర్ ద్వారా సినిమా ఏప్రిల్ 5వ తేదీన రాబోతున్నట్లుగా క్లారిటీ ఇచ్చారు. ఇక ఈ అఫీషియల్ క్లారిటీతో దేవర ఆ ఆ టైంకి రాకపోవచ్చు అని మరొక క్లారిటీ వచ్చేసింది. మొత్తానికి ఎలాంటి బిగ్ క్లాష్ లేకుండా సోలోగా డేట్ లభించడంతో రిలీజ్ డేట్ పై క్లారిటీ ఇచ్చారు. ఇక అదే టైంలో మరొక రెండు మీడియం రేంజ్ సినిమాలు కూడా వచ్చే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. త్వరలోనే ఫ్యామిలీ స్టార్ సినిమాకు సంబంధించిన షూటింగ్ కూడా ఫినిష్ అవుతుంది. ఇక వీలైనంత త్వరగా రెగ్యులర్ ప్రమోషన్స్ స్టార్ట్ చేయాలి అని చిత్ర యూనిట్ ఆలోచిస్తుంది.

## దివి.. అది నడుమా? హారి విల్లా?



బాలీవుడ్ హీరోయిన్స్ కు ఏమాత్రం తగ్గని గ్లామర్ దివి సొంతం. అయితే ఆమెకు కాలం కలిసి రాలేదని చెప్పొచ్చు. స్టార్ హీరోయిన్ అయ్యే రేంజ్ లో ఒక్క హిట్ కూడా పడలేదు. హీరోయిన్ కావాలని ఇండస్ట్రీకి వచ్చినా.. దివికి చిన్నా చితకా ఆఫర్స్ మాత్రమే వచ్చాయి. కొన్ని చిత్రాల్లో హీరోయిన్ గా నటించిన దివి.. స్టార్ హీరోల సినిమాల్లో సపోర్టింగ్ రోల్స్ చేస్తోంది. ఓవైపు తనకు వచ్చిన అవకాశాలు వదులుకోకుండా చేస్తూనే.. సోషల్ మీడియా వేదికగా అందాలతో ఆకట్టుకుంటుంది. దర్శక నిర్మాతలను తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తోంది. అదే సమయంలో ఫ్యాన్ ఫాలోయింగ్ ను పెంచుకుంటోంది. ఓ రేంజ్ లో పోజులు ఇస్తూ కుర్రాళ్ల మతులు పోగుడుతుంటోంది. ఎప్పటికప్పుడు గ్లామర్ ఫొటోలు షేర్ చేస్తూ నెట్టింట సందడి చేస్తుంటోంది. తాజాగా బీచ్ లో యోగా చేస్తున్న ఫొటోలను షేర్ చేసింది ఈ అమ్మడు. మార్నింగ్ సూర్యుడు ఉదయించే టైంలో యోగాసనాలు వేసిన ఫోటోలను పంచుకుంది. టైట్ ఫిట్ స్పోర్ట్స్ వేర్ లో నడుమును హరి విల్లులా వంచి చేసిన ఆసనం అయితే వేరే లెవల్ అని చెప్పవచ్చు. ఇప్పుడు ఈ బ్యూటీ పిక్స్ సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. యోగా కూడా ఇంత అందంగా ఉంటుందా అని ఫ్యాన్స్ కామెంట్లు పెడుతున్నారు. మహేశ్ బాబు- వంశీ పైడిపల్లి కాంబోలో తెరకెక్కిన మహర్షి చిత్రంలో కాలేజీ స్టూడెంట్ పాత్రలో మెరిసింది దివి. ఆ తర్వాత బిగ్ బాస్ ఆఫర్ దక్కించుకుంది. అయితే హౌస్ లో కాంట్రవర్సీలకు దూరంగా ఉన్న ఈ బ్యూటీ.. అమ్మ రాజశేఖర్ తో స్నేహం చేసింది. కొన్ని వారాలకే ఎలిమినేట్ అయినా.. షో వల్ల మంచి గుర్తింపు సంపాదించుకుంది.

గతేడాది రుద్రాంగి మూవీలో కీలక పాత్రలో నటించింది దివి. కానీ ఆ సినిమా ఆశించిన స్థాయిలో ఆడలేదు. మంచు విష్ణు జిన్నాలో హీరో చిన్నప్పటి ఫ్రెండ్ అయిన మూగ అమ్మాయి పాత్రలో నటించి మెప్పించింది. ప్రస్తుతం దివి.. పుష్ప 2లో జర్నలిస్ట్ రోల్ చేస్తోంది. ఈ పాన్ ఇండియా మూవీలో కొంచెం స్క్రీన్ స్పేస్ ఉన్న రోల్ ఆమెకు దక్కినట్లు తెలుస్తోంది. పుష్ప 2తో దివికి బ్రేక్ రావొచ్చని ఫ్యాన్స్ అంటున్నారు. మరేం జరుగుతుందో చూడాలి.

## నాయకి ఎదురు చూపులు ఎవరి కోసం?

అందాల నటి దివ్య ఖోస్లా కుమార్ ప్రధాన పాత్రలో సురేష్ కృష్ణ దర్శకత్వంలో ప్రేరణ అరోరా నిర్మిస్తున్న 'హీరో హీరోయిన్' త్వరలో విడుదల కానుంది. ఇటీవలే దివ్య ఖోస్లా ఫస్ట్ లుక్ విడుదలై ఆకట్టుకుంది. ఇప్పుడు మరో కొత్త లుక్ ని చిత్రబృందం రిలీజ్ చేసింది. ఈ పోస్టర్ లో దివ్య ముగ్ధ మనోహరంగా కనిపిస్తోంది. ఇది తెలుగు-హిందీ ద్విభాషా చిత్రం. తెలుగు వెర్షన్ కి 'నాయకి' అనే టైటిల్ ని ప్రకటించారు. పోస్టర్లు ఇప్పటికే ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. తాజాగా రిలీజ్ చేసిన కొత్త పోస్టర్‌లో నాయకి అందచందాలు మతులు చెడగొడుతున్నాయి. ఒక అందమైన రాకుమారి నవయవ్వన శిరులు కెమెరా ముందు హొయలు పోతున్న వైనం కనిపిస్తోంది. బీచ్ పరిసరాల్లో ఒక రాయిపై కూచుని తీక్షణంగా ఎవరి కోసమో ఎదురు చూపులు చూస్తున్న దివ్య సౌందర్యాన్ని చిత్రించేందుకు కెమెరా ట్రయల్




ప్యాడ్ ఫిక్స్ చేసి మరీ ఉంచారు. ఇది చూడగానే ఫోటోషూట్ కోసం ఏర్పాటు ఇది అని అర్థమవుతోంది. మొత్తానికి ఒక్క ఫోటోగ్రాఫ్ ద్వారా 'నాయకుని కోసం వేచి చూసే నాయకి'గా దివ్య కనిపిస్తోందని అవగతమవుతోంది. పోస్టర్లు, లుక్ లు ఆకట్టుకుంటున్నాయి.

'అబ్ తుమ్హారే హవాలే వతన్ సాథియో' అనే హిందీ చిత్రంతో ఆరంగేట్రం చేసిన దివ్య ఈ చిత్రంలో అక్షయ్ కుమార్ సరసన జతకట్టింది. ఆ తర్వాత సత్యమేవ జయతేలో జాన్ అబ్రహం సరసన నటించింది. ఇటీవలే విడుదలైన 'యారియాన్ 2'లో చక్కని నటనతో ఆకట్టుకుంది. దివ్య ఖోస్లా కుమార్ నటిగానే కాకుండా దర్శకనిర్మాతగాను రాణించారు. యారియాన్, సనమ్ రే వంటి చిత్రాలకు దర్శకత్వం వహించారు. 2004 లో ఉదయ్ కిరణ్ 'లవ్ టుడే' చిత్రంతో టాలీవుడ్ లో నటిగా పరిచయమైంది. ఆ తర్వాత హిందీ చలనచిత్ర రంగ ప్రవేశం చేసింది. టి సిరీస్ మేనేజింగ్ డైరెక్టర్ గాను దివ్య బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

## నల్లని డ్రెస్సులో మృణాల్ గ్లామర్ మెరుపులు

చూడగానే అందమైన చిరునవ్వుతో ఎంతగానో ఆకర్షించే బ్యూటీ మృణాల్ ఠాగూర్. మోడల్ గా మొదట గ్లామర్ ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును అందుకున్న ఈ బ్యూటిఫుల్ హీరోయిన్ ఆ తర్వాత బిగ్ స్క్రీన్ పై మెల్లమెల్లగా తన క్రేజ్ పెంచుకుం టూ వచ్చింది. వచ్చిన ఆఫర్స్ అన్నిటిని ఓకే చేయకుండా తనకు సెట్ అయ్యే పాత్రలను మాత్రమే సెలెక్ట్ చేసుకుంది. ఆ విషయంలో మృణాల్ సక్సెస్ అయింది కాబట్టి ఈరోజు ఆమెకు వరుసగా ఆఫర్స్ వస్తున్నాయి. ముఖ్యంగా గత రెండేళ్ల కాలంలో ఈ బ్యూటీ చేసిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద మినిమం సక్సెస్ అయ్యాయి. ఒకవైపు బాలీవుడ్ లోనూ మరొకవైపు టాలీవుడ్ లోనూ అమ్మడు బడా ప్రొడక్షన్ హౌస్ ల నుంచి అవకాశాలు అందుకుంటుంది. ముఖ్యంగా తెలుగులో చేసిన సీతారామం సినిమా ఏ స్థాయిలో సక్సెస్ అయిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇక సోషల్ మీడియాలో ఈ బ్యూటీ గ్లామర్ తోను తన క్రేజ్ ను పెంచుకునే ప్రయత్నం చేస్తుంది. ఇదివరకే చాలాసార్లు ఈ బ్యూటీ బికినీలో కూడా కనిపించింది. అయితే అలాగే



ట్రెడిషనల్ లుక్స్ తో కూడా బాగానే ఆకట్టుకుంటుంది. ఇక రీసెంట్ గా బ్లాక్ డ్రెస్ లో అమ్మడు తన అందాల మెరుపులతో కుర్రాళ్ల మతిపో గొట్టేసింది. ఈ లుక్ అయితే చాలా బాగుంది అంటూ మృణాల్ ఎలా కనిపించినా ఆ డ్రస్ కే అందం వస్తుంది అని పాజిటివ్ గా రియాక్ట్ అవుతున్నారు. ఇక మృణాల్ ఠాగూర్ 31 ఏళ్ల వయసులో ఉన్నప్పటికీ కూడా ఆమె అందం వయసు పాతికేళ్ల కంటే తక్కువగానే ఉంటుంది అని మరొకరు కామెంట్ చేస్తున్నారు. ఇక ఈ బ్యూటీ గత ఏడాది ఐదు సినిమాలలో కనిపించింది. ఇక అందులో నటించిన హాయ్ నాన్న సినిమా బాక్సాఫీస్ వద్ద పరవాలేదు అనేలా కలెక్షన్స్ అందుకుంది. తెలుగులోనే కాకుండా హిందీలో కూడా వరుసగా సినిమాలు చేస్తున్న అమ్మడు ప్రస్తుతం కోటి కంటే ఎక్కువ స్థాయిలోనే పారితోషకం అందుకుంటున్నట్లుగా తెలుస్తోంది. ఇక తెలుగులో విజయ్ దేవరకొండ తో చేసిన ఫ్యామిలీ స్టార్ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. దిల్ రాజు ప్రొడక్షన్లో రూపొందించిన ఈ సినిమాకు పరుశురామ్ దర్శకుడు. ఈ సినిమాపై కూడా అంచనాలు గట్టిగానే ఉన్నాయి. ఇక ఏప్రిల్ 5వ తేదీన ఈ సినిమాను గ్రాండ్ గా రిలీజ్ చేయనున్నారు.







# సీఎం రేవంత్‌పై తగ్గేదేలే అంటున్న హరీష్ రావు..!

హైదరాబాద్, ఫిబ్రవరి 5: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంస్కారం లేని భాష మాట్లాడుతున్నారని మాజీ మంత్రి హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నాడు హరీష్ మీడియాతో మాట్లాడుతూ.. సీఎం ఇలా మాట్లాడతారా..? అని ప్రజలు అసహ్యించుకున్నారని.. సీఎం భాష విలువలు పెంచేదిగా ఉండాలని హితవు పలికారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌పై నీచమైన భాష వాడారన్నారు. ప్రాజెక్టులు అప్పచెప్పామని రంకెలు వేస్తున్నారని మండిపడ్డారు. కేఆర్ఎంబీ మీటింగ్‌లో ప్రాజెక్టులు అప్పగించడానికి అంగీకరించారని.. అందుకే వివాదం మొదలైందన్నారు. జనవరి 17న ఢిల్లీలో జరిగిన మీటింగ్‌లో ప్రాజెక్టుల అప్పగింతకు ఆమోదం తెలిపారన్నారు. మినిట్స్‌లో అది స్పష్టంగా ఉందని.. అయినా రాష్ట్ర ప్రభుత్వానికి ఉలుకు పలుకు లేదని విమర్శించారు. తాను 19న ప్రెస్‌మీట్ పెట్టి కడిగిన తర్వాత మేలుకున్నారన్నారు. తాము ఒప్పుకోలేదని లేఖ రాశారని చెప్పారు.

ఫిబ్రవరి 1న రెండో కేఆర్ఎంబీ మీటింగ్ జరిగిందని.. ఆ మీటింగులో కూడా ప్రాజెక్టులు ఇవ్వడానికి ఒప్పుకున్నట్లు మినిట్స్‌లో ఉందన్నారు. అందులో పవర్ హౌజ్‌ల అప్పగింతకు మాత్రమే అభ్యంతరం చెప్పారని.. నీటి ప్రాజెక్టులపై మాత్రం అభ్యంతరం చెప్పలేదని మండిపడ్డారు. కేఆర్ఎంబీకి ప్రాజెక్టులు అప్పగించాలని నిర్ణయం తీసుకున్నట్లు రెండు రాష్ట్రాల ఈఎన్సీలు చెప్పారన్నారు.


కేసీఆర్ ఉన్నంత వరకు ప్రాజెక్టులు అప్పగించలేదని.. కాంగ్రెస్ వచ్చాకే ప్రాజెక్టులు కేంద్రం చేతిలో పెట్టి అడుక్కునే పరిస్థితి తెచ్చారన్నారు. రేవంత్ రెడ్డి అబద్దాల పునాదుల మీద ప్రభుత్వాన్ని నడపాలని అనుకుంటున్నారన్నారు. ఇది శాంపిల్ మాత్రమే అని అసెంబ్లీలో పూర్తి వివరాలు చెబుతామన్నారు.

**ఆనాడు పెదవులు మూసుకుంది ఎవరు?..** "పోతిరెడ్డి పాడు నుంచి నీరు తరలిస్తే పదవుల కోసం పెదవులు మూసుకున్నది మేము కాదు. నీ పక్కన ఉన్న ఉత్తమ్ రెడ్డి, కోమటిరెడ్డి పెదవులు మూసుకున్నారు. 610, పులిచింతల, వైఎస్ అన్యాయానికి వ్యతిరేకంగా జూలై 4, 2005న మేము కేబినెట్ నుంచి బయటకు వచ్చాం.. మేము బయటకు వచ్చాక మూడు నెలలకు పోతిరెడ్డి జీఓ వచ్చింది. టీడీపీలో ఉండి రేవంత్ ఆనాడు పెదవులు మూసుకున్నారు. పోతిరెడ్డి పాడుకు వ్యతిరేకంగా పోరాడింది మేము, పీజేఆర్. పోతిరెడ్డిపాడుపై 40 రోజులు అసెంబ్లీనీ స్తంభింపజేసినం" మాజీ మంత్రి హరీష్‌రావు పేర్కొన్నారు.

# కవిత పిటిషన్‌పై విచారణ వాయిదా

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. ఢిల్లీ మద్యం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లను కవిత సవాల్ చేశారు. దీనిపై సోమవారం విచారణ జరిపిన న్యాయస్థానం తదుపరి విచారణ ఈ నెల 16వ తేదీకి వాయిదా వేసింది. మహిళల విచారణలో సీఆర్పీసీ నిబంధనలు పాటించడం లేదని ఆమె ఆరోపిస్తూ సుప్రీంలో పిటిషన్ వేశారు. తనపై ఎలాంటి బలవంతపు చర్యలకు ఈడీ పాల్పడకుండా ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై గత కొద్ది నెలలుగా విచారణ వాయిదా పడుతూ వస్తోంది. కవిత పిటిషన్‌పై జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిథల్ ధర్మాసనం విచారణ చేపట్టింది. మహిళను ఈడీ కార్యాలయానికి పిలిపించి విచారణ జరపడం సరికాదని కవిత పిటిషన్‌లో పేర్కొన్నారు. నళిని చిదంబరం, అభిషేక్ బెనర్జీ దాఖలు చేసిన పిటిషన్లతో కవిత పిటిషన్ టాగ్ అయి ఉన్నందున కేసుల స్టేటస్ వివరాలు తెలపాలని, అన్ని కేసుల విచారణ ఒకేసారి చేపడతామని సుప్రీంకోర్టు తెలిపింది. అభిషేక్ బెనర్జీ , నళిని చిదంబరంల కేసులతో జతచేసి విచారణ జరుపుతామంది. అయితే ఈడీ సమ్మన్లకు కవిత స్పందించడం లేదని ఈడీ తరపు న్యాయవాది ఏఎస్‌జి ఎస్వీరాజు న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లారు. సమ్మన్లనే కవిత సవాలు చేసినందున దీనిపై విచారణ జరగాల్సిన అవసరం ఉందని కవిత తరపు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ పేర్కొన్నారు. తదుపరి విచారణ వరకు కవితను విచారణకు పిలవబోమని ఈడీ చెప్పిందని కపిల్ సిబల్ అన్నారు. తదుపరి విచారణ తేదీ వరకు అంటే మొత్తానికి విచారణకు పిలవబోమని అర్థం కాదని ఈదీ తరఫు న్యాయవాది ఎస్వీ రాజు వివరించారు.

# కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రశ్నిస్తూ భట్టికి కవిత లేఖ



హైదరాబాద్: కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రశ్నిస్తూ రాష్ట్ర హెూం మంత్రి భట్టి విక్రమార్కకు ఎమ్మెల్సీ కవిత లేఖ రాశారు. బడ్జెట్‌లో బీసీ సంక్షేమం కోసం 20 వేల కోట్లు కేటాయించాలని పేర్కొన్నారు. బీసీ సబ్ ప్లాన్‌కు చట్టబద్ధత కల్పిస్థామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. బీసీ సంక్షేమానికి రానున్న ఐదేళ్లల్లో లక్ష కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారని కవిత పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఎంబీసీల సంక్షేమానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో 50 కోట్లతో జయశంకర్ బీసీ ఐక్యతా భవనాలు నిర్మిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చారన్నారు. వీటన్నంటిని అమలు చేయాలని లేఖలో కవిత స్పష్టం చేశారు.

# టీజీ అక్షరాలు ఉండాలన్నది నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష

## కేబినెట్‌లో సంచలన నిర్ణయాలపై సీఎం రేవంత్ తాజా ట్వీట్ ఇదే..



హైదరాబాద్, ఫిబ్రవరి 5: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంచలన నిర్ణయాలు తీసుకుంటూ వార్తల్లో నిలుస్తోంది. కేబినెట్ సమావేశంలో రేవంత్ సర్కార్ తీసుకున్న నిర్ణయాలు ప్రస్తుతం రాష్ట్రంలో హాట్‌టాపిక్‌గా నిలిచాయి. "జయ జయహే తెలంగాణ" గీతాన్ని రాష్ట్ర అధికారిక గీతంగా ప్రకటించడం.. అలాగే వాహన రిజిస్ట్రేషన్లలో ఇక నుంచి టీఎస్ బదులు టీజీగా మారుస్తూ మంత్రి వర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. తెలంగాణలో కాంగ్రెస్ హయాంలో మారుతున్న విధానాలు, కేబినెట్‌లో తీసుకున్న సంచలన నిర్ణయాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ట్విట్టర్ వేదికగా స్పందించారు.

**ప్రజల ఆకాంక్ష మేరకే...** "ఒక జాతి అస్థిత్వానికి చిరునామా ఆ జాతి భాష, సాంస్కృతిక వారసత్వమే. ఆ వారసత్వాన్ని సమున్నతంగా నిలబెట్టాలన్న సదుద్దేశంతో ముందుకు వెళ్తున్నాం. 'జయ జయహే తెలంగాణ%ో%.' గీతాన్ని రాష్ట్ర అధికారిక గీతంగా ప్రకటించాం. సగటు తెలంగాణ ఆడబిడ్డ రూపురేఖలే తెలంగాణ తల్లి విగ్రహానికి ప్రతిరూపంగా తెలంగాణ తల్లిని రూపొందిస్తాం. రాచరికపోకడలు లేని చిహ్నమే రాష్ట్ర అధికారిక చిహ్నం రూపొందిస్తాం.

వాహన రిజిస్ట్రేషన్లలో టీఎస్ బదులు ఉద్యమ సమయంలో ప్రజలు నినదించిన టీజీ అక్షరాలు ఉంటాయి. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకే మా నిర్ణయాలు. ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ రాష్ట్ర కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నాం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు.

# మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడి కేసు.. పంజాగుట్ట మాజీ సీఐ అరెస్టు?



హైదరాబాద్: మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడికి సంబంధించిన రోడ్డు ప్రమాదం కేసులో సస్పెండైన పంజాగుట్ట మాజీ సీఐ దుర్గారావును పోలీసులు అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. కేసులో ఏ11గా ఉన్న ఆయన వారం నుంచి పరారీలో ఉన్నారు.

ఆదివారం మధ్యాహ్నం ఏపీలోని అనంతపురం జిల్లా గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో అదుపులోకి తీసుకొని హైదరాబాద్‌కు తీసుకొచ్చినట్లు సమాచారం. వెస్ట్‌జోన్ డీసీపీ కార్యాలయంలో దుర్గారావును పోలీసులు విచారిస్తున్నారు. ఇప్పటికే ముందస్తు బెయిల్ కోసం ఆయన హైకోర్టును ఆశ్రయించారు.




హైదరాబాద్: అక్రమాస్తుల కేసులో అరెస్టయిన హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణ లీలలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఏసీబీ దర్యాప్తులో రోజుకో సంచలనం వెలుగులోకి వస్తోంది. ఆరో రోజు సోమవారం ఏసీబీ అధికారులు శివ బాలకృష్ణను కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు. ఇప్పటికే ఐదు రోజుల పాటు బాలకృష్ణను విచారించిన అధికారులు కోట్ల రూపాయల అక్రమ ఆస్తులు గుర్తించారు. రియల్ ఎస్టేట్స్ వ్యాపారంలో పెట్టుబడులపై విచారించారు. ఇందులో ఎవరెవరు బాలకృష్ణకు బినామీలుగా వ్యవహరించారనే దానిపై విచారణ చేశారు. బాలకృష్ణ సోదరుడు శివ సునీల్ కుమార్‌ను కూడా అధికారులు విచారించారు. బాలకృష్ణ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసినట్లు గుర్తించారు. రెరా కార్యాలయంలోని బాలకృష్ణ చాంబర్‌లో లాకర్‌ను బ్రేక్ చేశారు. రూ. 12 లక్షల విలువ చేసే చీరలు, రూ. 20 లక్షలకు పైగా క్యాష్ లభ్యమైంది. వాటితో పాటు బాలకృష్ణ వైవాహిక జీవితానికి సంబంధించిన పలు ఫోటో ఆల్బమ్‌లు, కీలకమైన భూముల పాసు పుస్తాకాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ ఎండీఏ) పరిధిలో నిర్మించే బహుళ అంతస్తులకు సంబంధించి, అనుమతులు తీసుకునే సమయంలోనే.. 10 శాతం హెచ్ఎండీఏకు మార్టగేజ్ చేయాలనే నిబంధన ఉంది. సెట్‌బ్యాక్‌లను వదిలి, పర్మిషన్‌లో పేర్కొన్న ప్రకారమే నిర్మాణ పనులన్నీ పూర్తయితేనే.. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్(ఓసీ) ఇస్తారు. ఓసీ ఉంటేనే హెచ్ఎండీఏ ఆ మార్టగేజ్‌ను విడుదల చేస్తుంది. అధికారాన్ని అడ్డుపెట్టుకున్న శివబాలకృష్ణ.. మార్టగేజ్‌తోనే అసలు మతలబు నడిపినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. బహుళ అంతస్తుల భవనాల్లో.. ఫ్లాట్ల నిర్మాణాన్ని బట్టి.. తన వంతు వాటాను తీసుకునేవాడు. విల్లాల నిర్మాణంలోనూ ఇదే విధానాన్ని అనుసరించినట్లు ఏసీబీ నిర్ధారించింది. అలా వాటా తీసుకున్న ఫ్లాట్, ఇళ్లకు రిజిస్ట్రేషన్ కూడా చేయించుకో కుండా.. తన వారిని వాటిల్లో దింపేస్తాడు. ఆ ఫ్లాట్లు, ఇళ్లు బిల్డర్లు/ నిర్మాణ సంస్థ పేరిటే ఉన్నా.. ఎవరికీ విక్రయించే అవకాశం లేకుండా చేస్తాడు. అంతా అనుకున్నట్లు జరిగాక.. తన వాళ్ల పేరిట వాటిని రిజిస్ట్రేషన్ చేయిస్తాడు. ఇదే తరహాలో.. ఓ నిర్మాణ సంస్థ పేరిట ఉన్న విల్లాలో శివబాలకృష్ణ సన్నిహితులు ఇంటీరియర్ డిజైన్ చేస్తున్న విషయాన్ని ఏసీబీ గుర్తించింది. ఇలా శివబాలకృష్ణ తన సర్వీసులో ఆదాయానికి మించి విల్లాలు, ఫ్లాట్లు, స్థలాలను సేకరించాడని ఏసీబీ గుర్తించింది. దీన్ని బట్టి అధికార దుర్వినియోగం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు..! రెవెన్యూ సంబంధిత అంశాల్లో స్పష్టత కోసం సంబంధిత శాఖలో పనిచేసి, పదవీ విరమణ చేసిన అధికారుల సహకారం కోసం ఏసీబీ అధికారులు ప్రయత్నిస్తున్నారు.

# ఇల్లందులో బీఆర్ఎస్‌కు ఎదురుదెబ్బ.. వీగిన అవిశ్వాసం..



భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణలో ఎక్కడ చూసినా అవిశ్వాస తీర్మానంపైనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే పలు చోట్ల మున్సిపల్ చైర్మన్‌లపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టడం జరిగింది. ఏ కౌన్సిలర్ ఎటు ఓటు వేస్తాడో తెలియకుండా ఉంది. ఈ అవిశ్వాస తీర్మానాలు ఎక్కువగా కాంగ్రెస్‌కే ఫేవర్‌గా జరుగుతున్నాయి. నేడు ఇల్లందు మున్సిపల్ చైర్మన్ దమ్మలపాటి వెంకటేశ్వరరావుపై అవిశ్వాసం పెట్టడం జరిగింది. ఈ అవిశ్వాస పరీక్షలో బీఆర్ఎస్‌కు ఎదురు దెబ్బ తగిలింది. అవిశ్వాసం నెగ్గే మ్యాజిక్ ఫిగర్ లేకపోవడంతో అవిశ్వాసం వీగింది. అవిశ్వాసం వీగినట్లు ప్రిసైడింగ్ అధికారి ఆర్డీవో శిరీష ప్రకటించారు. దీంతో దమ్మాలపాటి తిరిగి చైర్మన్‌గా కొనసాగనున్నారు. కొద్ది రోజుల క్రితం మునిసిపల్ చైర్మన్ దమ్మాలపాటిపై అవిశ్వాసం కోరుతూ కొందరు కౌన్సిలర్లు వినతిపత్రం సమర్పించడంతో జిల్లా కలెక్టర్ అవిశ్వాస తీర్మానానికి ఆదేశాలు జారీ చేశారు. అయితే ఇల్లందు పురపాలకంలో చైర్మన్ సహా 24 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో కోరం ప్రకారం 17 మంది సభ్యులు హాజరవ్వాలి. ఒక్కరు తగ్గినా అవిశ్వాసం వీగుతుంది. కాగా.. అవిశ్వాస తీర్మాన సమావేశానికి 15 మంది మాత్రమే బీఆర్ఎస్ సభ్యులు ఉండటంతో అవిశ్వాసం వీగిపోయింది.

**మున్సిపల్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆందోళన..** అవిశ్వాస తీర్మానానికి ముందు.. పెద్ద రచ్చే జరిగింది. మున్సిపల్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆందోళన నిర్వహించారు. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తమ కౌన్సిలర్లను బలవంతంగా తీసుకెళ్లారంటూ మాజీ ఎమ్మెల్యే హరిప్రియ ఆందోళనకు దిగారు. అవిశ్వాస తీర్మానం ఓటింగ్ ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించాలన్నారు. అధికార బలంతో తమ పార్టీ కౌన్సిలర్స్‌ని కిడ్నాప్ చేశారని.. అవిశ్వాస పరీక్షకు మరో తేదీని ప్రకటించాలంటూ ఆందోళన నిర్వహించారు. బీఆర్ఎస్ కౌన్సిలర్స్ 15 మంది ఉండటంతో అధికారులు ఆ పార్టీకి అరగంట సమయం ఇచ్చారు. అయినా కూడా వారు రాలేదు. దీంతో అవిశ్వాసం వీగిపోయింది.

# కాంగ్రెస్ ఖాతాలోకి ఖానాపూర్ మున్సిపాలిటీ



నిర్మల్: జిల్లాలోని ఖానాపూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ ఖాతాలో చేరింది. బీఆర్ఎస్ చైర్మన్ రాజేందర్‌పై కాంగ్రెస్ పార్టీ అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీంతో ఖానాపూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ వశం అయింది. ఖానాపూర్ మున్సిపాలిటీలో నేడు ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి చైర్మన్, వైస్ చైర్మన్లపై బల నిరూపణ పరీక్ష నిర్వహించారు. ఆర్డీవో రత్నకుమారి ఆధ్వర్యంలో ఈ బలనిరూపణ పరీక్ష జరిగింది.

ఈ బలనిరూపణ పరీక్షలో మొత్తం 12 మంది కౌన్సిలర్లలో బీఆర్ఎస్ చైర్మన్‌కు వ్యతిరేకంగా 9 మంది కౌన్సిలర్లు ఓటేశారు. బీఆర్ఎస్‌కు చెందిన చైర్మన్ రాజేందర్, వైస్ చైర్మన్ ఖలీల్‌కు వ్యతిరేకంగా 9 మంది బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు ఒకటయ్యారు. దీంతో ఖానాపూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ వశమైంది.

# వేములవాడ రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు



రాజన్నసిరిసిల్ల జిల్లా: వేములవాడ రాజన్న ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. స్వామివారి దర్శనానికి క్యూలైన్లో భక్తులు బారులు తీరారు. భక్తుల రద్దీ దృష్ట్యా గర్భాలయంలో భక్తులచే నిర్వహించే ఆర్జిత సేవలను ఆలయ అధికారులు రద్దు చేసి.. లఘు దర్శనానికి అనుమతిచ్చారు. స్వామివారి దర్శనానికి సుమారు ఐదు గంటల సమయం పడుతోంది. ఆదివారమే వేములవాడ చేరుకున్న భక్తులు సోమవారం ఉదయాన్నే ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించారు. ధర్మగుండంలో స్నానం ఆచరించి ప్రత్యేక క్యూలెన్?ద్వారా స్వామివార్లను దర్శించుకుని, మొక్కులు చెల్లించుకుంటున్నారు. కాగా మేడారం జాతర దగ్గర పడడంతో భక్తుల రద్దీ పెరిగింది. గుడి చెరువు మైదానం భక్తుల వాహనాలతో నిండిపోయింది.

# బీఆర్ఎస్ శకం ముగిసింది: కె.లక్ష్మణ్



హైదరాబాద్ : తెలంగాణలో బీఆర్ఎస్ శకం ముగిసిందని, రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ పదికి తక్కువ కాకుండా సీట్లు, 35 శాతం ఓట్లు సాధించడం ఖాయమని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు. బీజేపీని నిలువరించేందుకే బీఆర్ఎసను బతికించే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తోందని, ఆ రెండు పార్టీలు తోడుదొంగలేనని అన్నారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూలును సాకుగా చూపించి ఆరు గ్యారంటీల అమలును వాయిదా వేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని లక్ష్మణ్ ఆరోపించారు. ఇండియా కూటమికి ఎజెండా లేదని, నాయకుడు ఎవరో తేల్చుకోలేక విపక్షాలు సతమతమవుతున్నాయని, దేశంలోని ప్రాంతీయపార్టీలు, కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు ఒక్కటై పోటీచేసినా బీజేపీని ఓడించలేవని తెలిపారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com